ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 25.0



● గాయత్రీదేవి నమోస్తుతే..

దేవీ నవరాత్రులు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఏలూరులోని అంబికాదేవి ఆలయంతో పాటు అయా ఆలయాల్లో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు, లలితా పారాయణలు నిర్వహించారు.

# దసరా స్పెషల్

» పండుగ రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
» హైదరాబాద్‌కు లగ్జరీ, అల్ట్రా డీలక్స్ సర్వీసులు
» ఈనెల 29 నుంచి 13, అక్టోబరు 3 నుంచి 26 సర్వీసులు అందుబాటులోకి ..



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)


దసరాకు స్పెషల్ బస్సులను నడిపేందుకు ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) సర్వం సమాయత్తం అవుతోంది. ఉచిత బస్సు ప్రయాణాలతో కొంతమేర ఇబ్బందుల్లో ఉన్న ఆర్టీసీ దసరా సీజన్‌కు స్పెషల్ బస్సులతో ఆదాయం రానుంది. ఇప్పటికే నెలా వారం రోజులు చిత బస్సుల నడిపినందుకు సుమారు 8 కోట్ల మేర ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ కావాల్సి ఉంది. స్పెషల్ బస్సులతో కొంత నిర్వహణా భారం అధిగమించడానికి ఆస్కారం కలగనుంది. ఇప్పటికే దసరా సెలవులకు సుదూర ప్రాంతాలకు బంధుగణం, పిల్లలు సరంజామాతో తరలి వెళ్లిపోయారు. తిరుగు ప్రయాణంలో ప్రయాణికులకు సత్వరం సేవలందించేందుకు ఆర్టీసీ సకల ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 29 నుంచి ఏలూరు నుంచి 6, జంగారెడ్డిగూడెం నుంచి 3, నూజివీడు నుంచి 4 బస్సు సర్వీస్‌లను సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సు హైదరాబాద్, బీహెచ్‌ఈఎల్, ఏజీబీఎస్, జీడిమెట్లకు సర్వీసులను అందుబాటులోకి తేనున్నారు. సూపర్ లగ్జరీ టిక్కెట్ ధర రూ.750, అల్ట్రా డీలక్స్ రూ.700 రూపాయలు ధర నిర్ణయించారు. ఇదే సందర్భంలో విజయవాడకు అవసరమైతే బస్సులను నడపడానికి ఆర్టీసీ యంత్రాంగం సన్నద్ధంగా ఉంది.

**తిరుగు ప్రయాణాలకు 26 సర్వీసులు**

దసరా సెలవులు అక్టోబరు రెండో తేదీతో పూర్తి కానున్నాయి. ఆ తర్వాత నుంచి వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు ప్రయాణికులకు రాక కోసం అక్టోబరు 3,4,5,6 తేదీల్లో 26 బస్సు సర్వీసులను నడపనున్నారు. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ సర్వీసులను కేటాయించారు. ఉచిత బస్సు ప్రయాణికుల తాకిడితో ఈ బస్సులకు ఆదరణ ఉంటుందా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రధానంగా 4,5 తేదీలు శని,ఆదివారాల్లోనే ఎక్కువ మంది ప్రయాణిలకు జిల్లాకు తిరుగుముఖం పట్టనున్నారు. దీంతో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు బస్సు డిపోల నుంచి అవసరమైతే డీలక్స్ బస్సులను నడిపేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. అయితే ఎంత ఆదాయం వస్తుందనేది అధికారులు అంచనాలు పెట్టుకోలేదు. విజయవాడ కేంద్రంలో ప్రజా రవాణా సంస్థ ఎండీ ద్వారకాతిరుమలరావు అన్ని జిల్లాల డీపీటీలు, కిందిస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని బుధ వారం నిర్వహించనున్నారు. దీంతో దసరా స్పెషల్ బస్సులు పెంపు, ఇతర అంశాలపై దిశానిర్దేశం చేసే వీలుంది. దసరా స్పెషల్ బస్సుల నడిపే అంశంపై జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీ) షేక్ షబ్నం మాట్లాడుతూ సాధారణ రేట్లతోనే ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడుపుతుందని, అన్నిచోట్ల అవసరమైతే సర్వీసులను పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## మంత్రి నిమ్మల ఇంట పెళ్లి సందడి

» కుమార్తె వివాహ వేడుకలకు భారీ ఏర్పాట్లు
» సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హాజరు




పాలకొల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల ఇంట పెళ్లి సందడి నెలకొంది. రామా నాయుడు, సూర్య కుమారిల ఏకైక కుమార్తె శ్రీజ వివాహం బుధవారం రాత్రి పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద నిర్వహించ నున్నారు. వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు రానున్నారు. బైపాస్ రోడ్డులో ప్రత్యేకంగా హెలిప్యాడ్ నిర్మాణం చేశారు. సుమారు 40 వేల మందికి పైగా వివాహానికి రానున్నట్టు అంచనా. వీరవాసరం మండలం తోలేరు గ్రామానికి చెందిన యిర్రింకి వెంకట సూర్య సత్యనారాయణ, కరుణామణిల ఏకైక కుమారుడు దుర్గా హరిహర సాయి పవన్ కుమార్‌తో శ్రీజ వివాహం బుధవారం రాత్రి 12.39 నిముషాలకు జరగనుంది. వివాహానికి వచ్చే వారికోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం వచ్చిన ఏ విధమైన ఇబ్బంది లేకుండా రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవో రాములు నాయక్

## సమస్యలను పరిష్కరించాలి : పీవో

బుట్టాయగూడెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వినతులు ద్వారా వస్తున్న సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కేఆర్ పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం అన్ని శాఖల అధికారులతో శాఖపరమైన సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్య క్రమాలను సమర్థవంతంగా అమలుకు మార్గదర్శకాలను జారీ చేశారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇదిగో హద్దు..!

## జిల్లాలో శరవేగంగా స్వామిత్వ సర్వే

» జిల్లాలో ఫేజ్-2లో 300 రెవెన్యూ గ్రామాలు ఎంపిక
» సర్వే ప్రయోజనాలను వివరిస్తూ గ్రామ సభలు
» ప్రతి ఇంటి నిజనిర్ధారణ కొలతలు.. కంప్యూటరీకరణ
» సమస్యలు ఉన్నచోట్ల రోవర్ల ద్వారా పరిష్కారం.. హక్కు పత్రాల అందజేత
» జిల్లాలో 95.84 శాతం పూర్తి : డీపీవో



ముదినేపల్లి మండలం పెయ్యేరులో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో అనూరాధ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ / ఆంధ్రప్రదేశ్ రీ- సర్వే ప్రాజెక్టులో భాగంగా ఇళ్లను రీసర్వే చేయాలని నిర్ణయించారు. ఫేజ్-2లో జిల్లాలో ఈ సర్వే నిర్వహించడానికి 300 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశారు. ఈ ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి సర్వే ప్రయోజనాలను అధికారులు వివరిస్తున్నారు. గ్రామ కంఠం, అదనపు గ్రామ కంఠం హద్దులు ఏర్పాటు, ప్రతి ఇంటినీ నిజనిర్ధారణ, కొలతల కంప్యూటరీకరణ ద్వారా హద్దులు ఏర్పాటు చేస్తారు. హద్దుల విషయంలో సమస్యలు ఉంటే ఆయా ప్రాంతాల్లో రోవర్ల ద్వారా సమస్యలు పరిష్కరిస్తారు. సర్వే అనంతరం కొత్త హక్కు దారులకు హక్కు పత్రాలను అందిస్తారు. ఈ హక్కు పత్రాల ద్వారా గ్రామీణ ఆస్తులను ఆర్థిక ఆస్తిగా ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తుంది. రుణాలు పొంద డానికి అవకాశం కలుగుతుం ది. గ్రామ పంచాయతీలు ఆస్తి పన్నులను సమర్థవం తంగా వసూలు చేయడానికి వీలుకలుగుతుంది.

**జిల్లాలో స్వామిత్వ సర్వే డేటా**

| మండలం | గ్రామాల సంఖ్య | సర్వే చేయాల్సిన స్థలాలు/ఇళ్లు | సర్వే చేసిన స్థలాలు/ఇళ్లు | సర్వే శాతం | కంప్యూటరీకరణ చేసినవి |
|---|---|---|---|---|---|
| కలిదిండి | 6 | 10856 | 3088 | 28.19 | 471 |
| పెదపాడు | 4 | 1948 | 1791 | 91.94 | 581 |
| మండవల్లి | 22 | 10918 | 11263 | 103.16 | 3333 |
| జంగారెడ్డిగూడెం | 13 | 10901 | 9895 | 90.77 | 3691 |
| ద్వారకాతిరుమల | 28 | 17180 | 17502 | 101.88 | 5845 |
| కైకలూరు | 17 | 16374 | 12018 | 73.40 | 6000 |
| బుట్టాయిగూడెం | 22 | 8652 | 8054 | 93.09 | 3568 |
| జీలుగుమిల్లి | 20 | 8852 | 8402 | 94.92 | 3929 |
| ఆగిరిపల్లి | 17 | 14456 | 13339 | 92.27 | 7153 |
| టి.నర్సాపురం | 14 | 13925 | 12190 | 87.54 | 7033 |
| పోలవరం | 3 | 2231 | 2053 | 92.03 | 1214 |
| కొయ్యలగూడెం | 8 | 13636 | 12764 | 93.61 | 7575 |
| చింతలపూడి | 30 | 14754 | 12352 | 83.72 | 8240 |
| కామవరపుకోట | 9 | 6681 | 6335 | 94.82 | 3862 |
| ముదినేపల్లి | 22 | 12915 | 12098 | 93.67 | 7639 |
| నూజివీడు | 20 | 16586 | 14439 | 87.06 | 9879 |
| ముసునూరు | 15 | 12986 | 11019 | 84.86 | 7804 |
| లింగపాలెం | 14 | 10398 | 10915 | 104.97 | 6344 |
| చాట్రాయి | 16 | 10419 | 12059 | 115.74 | 9259 |
| | 300 | 200669 | 192329 | 95.84 | 101891 |

**95.84 శాతం నిజనిర్ధారణ సర్వే పూర్తి**

ప్రస్తుతం జిల్లాలో సర్వేకి ఎంపిక చేసిన 300 రెవెన్యూ గ్రామాల్లో నిజ నిర్ధారణ సర్వే 95.84 శాతం వరకు పూర్తయింది. 50.78 శాతం కంప్యూ టరీకరణ ప్రక్రియ పూర్తయింది. 24 రెవెన్యూ గ్రామాల్లో వ్యక్తిగైజేషన్ పూర్తి చేసుకుని 9(2) నోటీసులు అందిస్తున్నారు. దాని ద్వారా ఇంటి యజమాని నుంచి ఏదైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి, తిరిగి సర్వేయర్ ద్వారా సర్వే చేయించి సమస్యలను పరిష్కరిస్తారు. స్వామిత్వ సర్వే పూర్తి చేయడానికి డీపీవో కార్యాలయ కమాండ్ కంట్రోల్ టీమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించి చర్యలు తీసుకుంటుంది. అక్టోబరు 31 నాటికి 300 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని నిర్ణయించారు.

**జిల్లాలో చురుగ్గా స్వామిత్వ సర్వే**

స్వామిత్వ సర్వే జిల్లాలో చురుగ్గా కొనసాగుతోంది. ఇళ్ల కొలతలు తీసుకుని వాటిని కంప్యూటరీకరణ చేస్తారు. జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్వే టీంలు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. ఇంటి నిర్మాణం, స్థలానికి సంబంధించి కొలతలు తీస్తున్నారు. వాటిని కంప్యూటరీకరణ చేస్తారు. ఈ సర్వేను అక్టోబరు 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నదే లక్ష్యం. ఇప్పటివరకు 95.84 శాతం నిజ నిర్ధారణ సర్వే పూర్తి కాగా, 50.78 శాతం ఇళ్ల కొలతల కంప్యూటరీకరణ అయింది. నవంబరు 1వ తేదీ నుంచి ఫేజ్-3 సర్వే ప్రారంభిస్తాం.


- కొడాలి అనూరాధ, జిల్లా పంచాయతీ అధికారిణి

## లోటుపాట్లు రానివ్వద్దు
» ఏలూరులో వసతి, ప్రయాణ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

» 25న వెలగపూడిలో నియామక పత్రాలు అందుకోనున్న మెగా డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులు

■ లోపలి పేజీలో..

# పసిడికి.. ట్రంప్ ఎఫెక్ట్!

» ఒక్కరోజులో గ్రాముకు రూ.130 పెరుగుదల
» బిస్కెట్ బంగారం గ్రాము రూ.11,870
» ఆర్నమెంట్ రూ.10,920

నరసాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పసిడి ధరకు ట్రంప్ ఎఫెక్ట్ తగ్గడం లేదు. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో రోజు రోజుకు దూసుకుపోతున్నది. ఈ రెండురోజుల్లో గ్రాముకు రూ.300 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో మంగళవారం బిస్కెట్ బంగారం గ్రాము రూ.11,870కి చేరగా ఆర్నమెంట్ బంగారం రూ.10,920 పలికింది. ట్రంప్ ఆమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పసిడి ధర పెరుగుతూ వస్తున్నది. ఈ ఏడాది జనవరిలో గ్రాము బిస్కెట్ బంగారం రూ.7,940 ఉండగా ఆర్నమెంట్ బంగారం రూ.7,300 ఉంది. ఈ తొమ్మిది నెలల కాలంలో బిస్కెట్ గ్రాముకు రూ.3,930, ఆర్నమెంట్‌కు రూ.3,620 పెరిగింది. ఈ ధర ఇదే విధంగా పెరిగితే ఈ ఏడాది చివరికి గ్రాము రూ.13 వేలకు చేరే అవకాశం ఉందని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**పండుగ కళ లేనట్లే**

దసరా, దీపావళి పండుగలకు చాలా మంది పసిడి వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ఎక్కువగా దీపావళికే సెంటిమెంట్‌గా ఆభరణాలు చేయించుకుంటారు. ఈసారి మార్కెట్‌లో పండుగ కళ కనిపించడం లేదు. బంగారం ధర రోజురోజుకు పెరుగుతుండటంతో మార్కెట్ వైపు వినియోగదారులు కన్నెత్తి చూడటం లేదు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. సీజన్ ప్రభావం మచ్చుకైనా కనిపించడం లేదు. దాదాపు నెల తరువాత మళ్లీ శుభ కార్యక్రమాలు మొదలవడంతో బిజినెస్ ఉంటుందని వ్యాపారులు అంచనా వేశారు. కానీ ధర తగ్గకపోవడంతో పెద్ద మొత్తాల్లో కొనుగోలు చేయడం లేదు. సూత్రాలు, నల్లపూసలు వంటి చిన్న వస్తువులతోనే సరిపెడుతున్నారు.

## తల్లి ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం : కలెక్టర్



జాలిపూడిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఏలూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : తల్లి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంతో పాటు సమాజం ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి ఎంపీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో మంగళవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు.గ్రామంలో గ్రౌండు వాటర్ బాగోలేద ని చెప్పడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. జి.విజయ్‌కుమార్, వైద్యాధికారులు డా.ఆర్.ఫణీంద్రకుమార్, డా.సి.హెచ్ పూర్ణ శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

**చెరువుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి**

జాలిపూడిలో మంగళవారం ఆక్వా చెరువులను మత్స్యశాఖ అధికారులు, సంబంధిత రైతులతో కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకుని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 26,582 ఆక్వా చెరువులు ఉన్నాయని, విలేజ్ ఆక్వాకల్చర్ యాప్‌లో ఇప్పటి వరకు 20,900 నమోదయ్యాయన్నారు. జిల్లా మత్స్య శాఖ డీడీ బి.నర్సయ్య, తహసీల్దారు జి.విజయ కుమార్, మండల మత్స్యశాఖ అధికారి ఎ.సతీష్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

**ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష**

**ఏలూరుసిటీ** : పేదల ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి గృహనిర్మాణ శాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం- 1.0 కింద పేదల ఇళ్ల నిర్మాణ ప్రగతిపై కలెక్టరేట్ నుంచి మంగళవారం గృహ నిర్మాణ శాఖాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాకు కేటాయించిన 12,345 ఇళ్లకు గాను ఇప్పటివరకు 10,240 ఇళ్లు పూర్తి చేశారని, మిగిలిన 2,105 ఇళ్లను పూర్తి చేసేలా ఇంజనీరింగ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హౌసింగ్ పీడీ సత్య నారాయణ, ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

**భూసేకరణ వేగవంతం**

**ఏలూరు**: జిల్లాలో జాతీయ రహదారులకు భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. భూసేకరణపై కలెక్టర్ మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పామర్రు-ఆకివీడు ఎన్‌హెచ్ 165 జాతీయ రహదారిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి భూసేకరణకు కోర్టులోని కేసు పరిష్కారం చేపట్టాలన్నారు.గ్రీన్‌ఫీల్డ్ హైవేలో తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి జీలుగుమిల్లి- పట్టిసీమ భూసేకరణ పూర్తి చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో వల్లూరు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



● చెరువు కాదు రోడ్డే..

పందిరివామిడిగూడెం-కామవరం ఆర్ అండ్‌బీ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి రోడ్డంతా చెరువును తలపిస్తోంది. గోతుల్లోకి నీరు చేరడంతో ఎంతలోతు ఉన్నాయో తెలియక వాహనదారులు, గుబ్బల మంగమ్మతల్లి ఆలయానికి వచ్చే భక్తులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండు కిలో మీటర్ల మేర రోడ్డంతా ఇలానే గోతులు దర్శనమిస్తున్నాయి. ఆలయ కమిటీ వారు పెద్దపెద్ద గోతులను పూడ్చ డం సాధ్యమయ్యే పనికాదని గుర్తించి కూలీలను ఏర్పాటుచేసి మంగళవారం గోతుల్లో చేరిన నీటిని తొలగింపజేశారు.

- బుట్టాయగూడెం

## విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ యత్నం

» నత్తగుల్లపాడు సర్పంచ్‌పై గ్రామస్థుల ఫిర్యాదు



సర్పంచ్‌పై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన నత్తగుల్లపాడు గ్రామస్థులు

కైకలూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామాల్లో రెండు వర్గాల మధ్య విబేధాలు సృష్టించేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నం చేస్తున్నారని నత్తగుల్లపాడుకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ ముంగర రామకృష్ణం రాజుపై వందలాది మంది గ్రామస్థులు కైకలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం తరలివచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం నబిగారి కృష్ణానంద్, ఇతర గ్రామస్థులు విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్‌గా 2023లో ఇళ్ల స్థలాల నిమిత్తం ఒక్కొక్క లబ్ధిదారు నుంచి రూ.15 వేలు వరకు వసూలు చేశారని, జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయిలు ఉచితంగా ఇవ్వాల్సి ఉండగా ఒక్కొక్క కుళాయికి రూ.2వేలు పైబడి వసూలు చేశారన్నారు. గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, పంచాయతీ నిధుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సర్పంచ్ వెనుక ఉండి ఉద్దేశపూర్వకంగా కొల్లేరు గ్రామాల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకుంటున్నామన్నారు. ఇటువంటి ప్రయత్నాలు విరమించకుంటే రహదారిపై బైఠాయించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా గ్రామంలోని కొందరు యువకులు సోమవారం రాత్రి తనపై దాడికి పాల్పడ్డారని సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అల్పపీడనం.. జోరు వర్షాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి మబ్బుల వాతావరణం కొనసాగిన సాయంత్రం నుంచి పలు ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ఉంగుటూరు మండలంలో 32.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 4.7 మి.మీ నమోదైంది. కలిదిండి 31, మండవల్లి 25.6, కైకలూరు 16.2, ఆగిరిపల్లి 10.2, నూజివీడు 4.6, చాట్రాయి 3.8, కొయ్యలగూడెం 3.6, పెదపాడు 2.4, కుక్కునూరు 1.6, ముదినేపల్లి 1.2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

## ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో భద్రత : ఎస్పీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవులకు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్ళే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ జిల్లా ప్రజలకు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా ఇంటికి అదనపు రక్షణ కల్పిస్తారన్నారు. దసరా, దీపావళి పండుగలకు కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి వెళ్లేవారు ముందుగా సంబంధిత పోలీసులకు సమాచారం ఇస్తే వారు ఆ ఇంట్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాను ఏర్పాటు చేస్తారన్నారు. ఎవరైనా ఆ ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే పోలీసులకు సమాచారం అందుతుందని పోలీసులు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుంటారన్నారు. ఉచితంగానే ఈ సేవలను అందిస్తామని ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

# గాయత్రీ దేవి దర్శనం

ఉమ్మడి జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దసరా ఉత్సవాల్లో రెండో రోజు అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. భీమవరం మావుళ్లమ్మ, ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, జంగారెడ్డిగూడెం నూకాలమ్మ, వీరంపాలెం బాలా త్రిపుర సుందరీదేవి, తాడేపల్లిగూడెం బలుసులమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గునుపూడి సోమేశ్వరాలయం, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరాలయాల్లో పార్వతి దేవిని భక్తులు దర్శించుకున్నారు. ఆచంట రామేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు. ఏలూరులోని అమ్మవారి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు.



ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ



తాడేపల్లిగూడెం గాయత్రిమాత



వీరంపాలెం బాలా త్రిపుర సుందరి



ఏలూరు పత్తేబాద, సత్రంపాడులో అమ్మవార్లకు గాయత్రి దేవి అలంకరణ





జంగారెడ్డిగూడెం గంగానమ్మ





భీమవరం మావుళ్లమ్మ, మెంటేవారి తోటలో దుర్గమ్మ



గాయత్రిదేవిగా నూకాలమ్మ



పెనుగొండలో గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన వాసవీ మాత



ఆచంటలో పార్వతీదేవి



కాళ్లకూరులో ధనలక్ష్మి అలంకారం



క్షీరారామంలో గాయత్రిగా పార్వతీదేవి



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో వామపక్ష నాయకుల నిరసన

## బలవంతపు భూసేకరణ తగదు

### ఆయుధ డిపో ఏర్పాటు.. నిర్బంధాలపై వామపక్షాల నిరసన

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండలంలో ఆయుధ డిపో పేరుతో బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజలు, ప్రజా సంఘాలపై పోలీసుల నిర్బంధాన్ని, దౌర్జన్యాన్ని నిరసిస్తూ పాతబస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆర్.లింగరాజు, బద్దా వెంకట్రావు, అడ్డగర్ల విజయ మాట్లాడుతూ గిరిజనుల భూములు కొల్లగొట్టేందుకు ఆయుధ డిపోను అడ్డుపెట్టుకున్నారని విమర్శించారు. గ్రామ సభల నిర్ణయానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రయత్నాలపై నిరసన ర్యాలీ చేస్తున్న జీలుగుమిల్లి మండల ప్రజలపై పోలీసు దౌర్జన్యం, నిర్బంధం తగదన్నారు. గ్రామసభలకు విలువ లేకుండా చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన భూములకు రక్షణగా ఉన్న చట్టాలను తుంగలోకి తొక్కి ప్రభుత్వం ముందుకు వెళ్లాలని ప్రయత్నం చేస్తూ తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డీఎన్‌వీడీప్రసాద్, పంపన రవికుమార్, కడలి రామాంజనేయులు, వీవీవీఎస్‌ప్రసాద్, కోటేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, పిన్నంటి త్రినాథ్, సీపీఐ నాయకులు మావూరి విజయ, పి.శంకర్, బల్ల కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ప్రజల చైతన్యంతో చేపట్టే ప్రజా ఉద్యమాలను పోలీసు నిర్బంధాలు ఆపలేవని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుధాకర్ అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని గృహనిర్బంధం చేయడం దుర్మార్గం అన్నారు. న్యూడెమోక్రసీ నాయకుడు సరియం రామ్మోహన్, ప్రజా సంఘాల నాయకులను ఇళ్ళ వద్దనే పోలీసులు గృహనిర్బంధాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.



మడకంవారిగూడెం వద్ద డీఎస్పీ వెంకటేశ్వరావు సీఐ, ఎస్సై, పోలీసులు

## ఆయుధ డిపో వద్దు

### గిరిజన సంఘాల ర్యాలీ.. అడ్డుకున్న పోలీసులు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వంకవారిగూడెం పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయవద్దని గిరిజన సంఘాలు గళమెత్తాయి. మడకంవారిగూడెం నుంచి జీలుగుమిల్లి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించేందుకు మంగళవారం పలు గిరిజన సంఘాల నాయకులు సమాయత్తమయ్యారు. పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరావు, డివిజన్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది అక్కడ మోహరించారు. ఒక దశలో పోలీస్, గిరిజన సంఘాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆయుధ డిపో ఏర్పాటుచేస్తే తాము మనుగడ కోల్పోతామని వంకవారిగూడెం, దాట్లవారిగూడెం, చీమలవారిగూడం గ్రామాల గిరిజనులు నినాదాలు చేశారు. ర్యాలీని అడ్డుకునేందుకు వచ్చిన పోలీస్‌లపై వాగ్వివాదానికి దిగారు. అనంతరం పోలీస్‌లు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో మడకంవారిగూడెంలోనే గిరిజనులంతా రోడ్డుపై బైఠాయించారు. ఈ క్రమంలో గిరిజన సంఘాల నాయకులు పోలీస్‌ల మధ్య తోపులాట జరిగింది. కొద్ది సేపటికి ఇరు వర్గాలు శాంతించాయి. సమస్యను పోలీస్‌లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరో వైపు గిరిజనులు తమకు ఎదురయ్యే సమస్యలపై పోలీస్‌ల ముందు ఏకరువు పెట్టారు. ప్రస్తుతం జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని, ప్రజలు సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని గిరిజన సంఘాల నేతలకు డీఎస్పీ నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సాయంత్రం వరకు ఎటువంటి వివాదం తలెత్తకుండా పరిస్థితి అదుపులో ఉంది.

### నేవీ ఆయుధ డిపోతో అభివృద్ధి : చిర్రి బాలరాజు, ఎమ్మెల్యే

వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుతో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కొందరు కావాలని గిరిజనుల మనుగడకు విఘాతం కలుగుతుందని అపోహలు కలిగిస్తున్నారన్నారు. ఎంపీ పుట్టా మహేష్ కేంద్రంతో సంప్రదింపులు జరిపారన్నారు. ఈ ప్రాంత వాసులకు ప్యాకేజీ అమలు చేసిన అనంతరం నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేస్తారన్నారు.



మడకంవారిగూడెంలో రోడ్డుపై బైఠాయించిన గిరిజనులు

# మ్యూజిక్ వైబ్ మిరాయ్

## సంగీత దర్శకుడు గౌర హరి మన కుర్రోడే



హరికి జ్ఞాపిక ఇస్తున్న ఆర్‌ఆర్‌ఆర్

**తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన వండర్ విజువల్స్ హనుమాన్, మిరాయి చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాలు నమోదు చేశాయి. తాజా చిత్రం మిరాయ్ దేశవ్యాప్తంగా రికార్డుల మోత మోగిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్‌తో నిర్మితమైన ఈ చిత్రాలకు సంగీతం ప్రధానం. అద్భుత నేపథ్య సంగీతంతో సినిమా అలరిస్తే పాటలు మరింత ఆకట్టుకున్నాయి. సినిమాలో 'వైబ్ ఉంది' పాట చిత్రించినా తెరపై మాత్రం తొలగించారు. ఆడియో విడుదలతో విశేషంగా ఆకట్టుకుంది. అభిమానుల కోరిక మేరకు ఈ గీతాన్ని తెరపై చూపబోతున్నారు. ఈ చిత్రాలకు సంగీత దర్శకుడు గౌర హరి మన గోదావరి జిల్లా వాసి. హరి తాతయ్య, అమ్మమ్మ స్వగ్రామం ఉండి. నానమ్మ, తాతయ్య స్వగ్రామం తణుకు. కొన్నాళ్లు ఉండిలో ఉన్న హరి విద్యాభ్యాసం తణుకులో సాగింది. తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయాడు. సంగీత దర్శకుడిగా అద్భుత ప్రతిభతో సొంత జిల్లాకు పేరు తెచ్చాడు.**







ఉండి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న సంగీత దర్శకుడు గౌర హరి ఉండి కుర్రోడు. తాడికొండ లక్ష్మీనరసింహం (కరణం), సావిత్రమ్మ దంపతుల పెద్దకుమార్తె రాధా రమణి, క్రొవ్విడి బాల సుబ్రహ్మణ్యం సంతానం గౌర హరి. అతడికి ఒక చెల్లెలు ఉంది. అమ్మమ్మ ఊరు ఉండి బ్రాహ్మణపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంనకు సమీపంలో వారి కుటుంబం నివసించేది. ఇక్కడే ప్రాథమికి విద్యాభ్యాసం తర్వాత కొన్నాళ్లు నానమ్మ ఊరైన తణుకులో ఉన్నారు. తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయాడు. అక్కడ ప్రముఖ సంగీత దర్శకుడి వద్ద సంగీతంలో ప్రావీణ్యం సంపాదించాడు. హనుమాన్, మిరాయ్ సినిమాలకు సంగీత దర్శకత్వం వహించడంతో పాన్ ఇండియా స్థాయిలో గౌర హరి పేరు దద్దరిల్లింది. తొలిసారి సంగీత దర్శకత్వం వహించిన రెండు చిత్రాలు అద్భుత విజయాలు సాధించడంతో చిత్రసీమలో ప్రస్తుతం దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్ మణికొండలో నివాసం ఉంటున్నాడు.

### ఆర్‌ఆర్‌ఆర్ అభినందన

శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు సంగీత దర్శకుడు హరికి వేంకటేశ్వరస్వామి జ్ఞాపికన అందించి అభినందించారు. తన నియోజకవర్గానికి చెందిన యువకుడు చిత్రసీమలో అద్భుతంగా రాణించడం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమని హరిని అభినందించారు. స్థానికంగా పలువురు అభిమానులు గౌర హరి చిత్రం గీసి అభిమానాన్ని చాటుకున్నారు.

### ఉండిలో ఒకటే సందడి..

తమ గ్రామానికి చెందిన యువకుడు చిత్రసీమలో మంచి గుర్తింపును సాధించడంతో ఉండిలో సందడి నెలకొంది. సినిమాలో లేని పాట 'వైబ్ ఉంది' ఇక్కడ మరింత మారుమోగుతోంది. గ్రామంలో యువత సంబరాలు జరుపుకున్నారు. గౌర హరి ఉండి రాక కోసం ఎదురుచూస్తున్నారు.

### ఎంతో ఆనందం



మా గ్రామానికి చెందిన కుర్రోడు చిత్రపరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకోవడం ఆనందంగా ఉంది. మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిస్తున్నాను. ఇదేరీతిలో చిత్రపరిశ్రమలో కొనసాగాలని కోరుకుంటూ ఆశీర్వదిస్తున్నాను.

**- ఇందుకూరి హరినారాయణరాజు, ఎంపీపీ, ఉండి**

### మా ఇంటి పక్కనే ఉండేవారు



గౌర హరి కుటుంబం మా ఇంటి పక్కనే నివాసం. మా కుటుంబంతో కలిసిమెలిసి ఉండేవారం. అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. హరి ఉన్నత స్థాయికి వెళ్లడం సంతోషంగా ఉంది.

**- కామేశ్వరి (నాని మేడమ్), ఉండి**

### నా స్నేహితురాలికి అభినందనలు



నా స్నేహితురాలి కుమారుడు హరి. సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు సాధించడం సంతోషం. నా స్నేహితురాలికి అభినంనలు. మా దగ్గర చిన్నపిల్లోడు పెద్దస్థాయికి వెళ్లడం ఆనందంగా వుంది.

**- కోకా పద్మిని, ఉండి**

### మరిన్ని విజయాలు సాధించాలి



మిరాయ్, హనుమాన్ చిత్రాలతో హరి మంచి పేరు తెచ్చుకున్నాడు. ప్రేక్షకుల అభిమానం పొందడం గొప్ప విషయం. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిస్తున్నాను.

**- నల్లా సత్యకిరణ్ ప్రసాద్, ఉండి**

# బహుళ పంట విధానం రైతుకు లాభం

### సీపీసీఆర్‌ఐ మాజీ డైరెక్టర్ చౌడప్ప



కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగును పరిశీలిస్తున్న డాక్టర్ చౌడప్ప

పెదవేగి/కామవరపుకోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో పెరిగిన పెట్టుబడికి అనుగుణంగా లాభాలను పొందడానికి బహుళ పంటల విధానం ఒక్కటే మార్గమని సీపీసీఆర్‌ఐ మాజీ డైరెక్టర్ పి.చౌడప్ప అన్నారు. కామవరపుకోట మండలం, పెదవేగి మండలం వంగూరులో కొబ్బరి, పెదవేగిలో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగును చౌడప్ప మంగళవారం పరిశీలించారు. సాగులో యాజమాన్య విధానాలు, జాగ్రత్తలను ఆయన రైతులను అడిగి తెలుసుకు న్నారు. చౌడప్ప మాట్లాడుతూ ఎక్కువగా కొబ్బరిలో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నారన్నారు. ఆయిల్‌పామ్‌లో కూడా అంతరపంటగా కోకో సాగు లాభసాటి అన్నారు. అరటిలో కూడా కోకోను సాగుచేసే వీలుందని, ఈ దిశగా రైతులు సాగు చేపట్టవచ్చని ఆయన సూచించారు. ఆధునిక సాంకేతిక అభివృద్ధిని అందుకున్న నేటికాలంలో బహుళ పంటల వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. సాగు వ్యయం భారీగా పెరిగిన తరుణంలో బహుళ పంటల సాగు ఒక్కటే రైతులను నిలబెడుతుందని, రైతే ఒక శాస్త్రవేత్త కావాలని, అప్పుడే నూతన పంటల సాగు మరింతగా విస్తరిస్తుందన్నారు. కోకో పంటలో నాణ్యమైన దిగుబడిని సాధించడానికి మెరుగైన యాజమాన్య పద్ధతులను పాటించాలని, కోత అనంతరం తీసుకునే నిర్వహణతో గింజ నాణ్యత పెరిగి, మంచి ధర వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏవిధమైన ప్రోత్సాహకాలు అందిస్తే రైతులకు తోడ్పాటుగా ఉంటుందో అనే అంశంపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఈ సందర్భంగా డాక్టర్ చౌడప్ప తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్.రామ్మోహన్, ఏడీ కె.సంతోష్, మండల ఉద్యానశాఖాధికారి ఎం.రత్నమాల, వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# వేలంతో పొగాకుకు మంచి ధర



పొగాకు వేలం కేంద్రంలో రైతులు

కొయ్యలగూడెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్ల వేలం ద్వారా (ఈ-ఆక్షన్) నిర్వహించడం ఎంతో మేలు జరుగుతుందని, మంచి ధర లభిస్తుందని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విధానం అన్ని పంటలకు వర్తింపజేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. స్థానిక పొగాకుబోర్డు ఆవరణలో మంగళవారం రైతులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఆక్షన్‌తో అధిక రేట్లు వస్తున్నాయని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభ దశ నుంచే పొగాకు కొనుగోళ్ల అధిక ధర పలికాయన్నారు. కేజీ రూ.430 ధరకు కొనుగోలు చేయడంతో రైతులంతా నష్టం లేకుండా వ్యవసాయం చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమలో పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది, ఉపాధ్యక్షుడు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, అడపా సత్తిబాబు, అన్నంరెడ్డి సత్యనారాయణ, బోసు, పారేపల్లి శ్రీనివాస్, మద్దిబోయి శ్రీనివాస్, పల్లి గణపతి, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న నాయకులు

## 4న తిరుపతిలో దేవాంగ సత్రం ప్రారంభం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఓల్డ్ తిరుచానూరు రోడ్ అంకాల పరమేశ్వరి దేవస్థానం పక్కన రూ.45 కోట్లతో నిర్మించిన శ్రీనివాస ఉమా రామలింగేశ్వర నిత్యాన్నదాన దేవాంగ సత్రాన్ని వచ్చే నెల 4న ప్రారంభిస్తామని దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. తూర్పు వీధిలోని దేవాంగ సత్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవాంగులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. తిరుపతిలో మూడు బ్లాకులుగా ఒక్కొక్క బ్లాక్ 6 అంతస్తులుగా దేవాంగ సత్రం నిర్మించారన్నారు. కార్యక్రమంలో సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్, నక్కిన చిన్న వెంకటరాయుడు, అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్, ఊటుకూరు సుబ్రహ్మణ్యం, మాడిశెట్టి శివశంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా

## మండపాక పీడీ ఎంపిక




తణుకు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండపాక జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణ రిఫరీగా ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె ఫణిశ్రీ తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకూ గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈసందర్భంగా పీడీ సూర్యనారాయణను పలువురు అభినందించారు.

### ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తులకు గడువు పెంపు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి ఎంపికైన వారు పోర్టల్ దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించారు. గత ఏడాది డిసెంబరులో ఎంపికైన విద్యార్థుల తోపాటు, 2021 నుంచి 2023వరకు ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 30వరకు పొడిగించినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ మంగళవారం తెలిపారు. నిర్ణీత పోర్టల్‌లో గడువులోగా నమోదు/రెన్యువల్‌చేసుకోని విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు కాదన్నారు.

### దూరవిద్య టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూర విద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు రూ.200 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించేందుకు గడువు తేదీ అక్టోబరు 31వరకు పొడిగించినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. వివరాలకు ఏపీ ఓపెన్‌స్కూల్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.



ఉత్తమ ప్రాజెక్టులతో స్మార్ట్ ఇండియా ప్రదర్శనకు ఎంపికైన ఫార్మసీ విద్యార్థినులతో ప్రిన్సిపాల్

## స్మార్ట్ ఇండియా హాకథాన్‌కు సీఆర్‌ఆర్ విద్యార్థుల ప్రాజెక్టులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగంలో నూతన ఆవిష్కరణలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) అధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నల్ హాకథాన్-2025 రెండు రోజుల సన్నాహక కార్యక్రమం మంగళవారం సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలలో ముగిసింది. ఆరోగ్యం, విద్య, పర్యావరణం, వ్యవసాయం, డిజిటల్ ఇండియా, సుస్థిరాభివృద్ధి, తదితర విభిన్నరంగాల్లో ఫార్మసీ కోర్సుల విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించారు. వివిద ప్రాజెక్టుల ప్రయోజనాలు, వాటి ఉద్దేశ్యం, కార్యరూపం ప్రామాణికాలుగా ఉత్తమ ప్రాజెక్టులను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర మాట్లాడుతూ త్వరలో జరుగనున్న స్మార్ట్ ఇండియా హాకథాన్-2025కు ఫార్మసీ రంగంలో విస్తృత పరిశోధనలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం ద్వారా వారి సామర్థ్యాలను ప్రోత్సహించడానికి రెండు రోజుల సన్నాహక కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. ఉత్తమ ప్రదర్శనలను రూపొందించిన విద్యార్థులను స్మార్ట్ ఇండియా హాకథాన్‌కు పంపిస్తామన్నారు.

## అధ్యక్షా..

అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు పలు సమస్యలను లేవనెత్తారు. వారేమన్నారంటే..

### • కార్మికుల సంక్షేమ బోర్డు బలోపేతం చేయాలి



లక్ష మంది కార్మికులు సభ్యులుగా ఉన్న భవన నిర్మాణ సంక్షేమ బోర్డును మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నిధులను పక్కదారి పట్టించింది. సభ్యులు దాచుకున్న సొమ్ము సైతం దోచుకుంది. కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కమిటీని నియమించింది. పెండింగ్‌లో వున్న 50 వేల మంది క్లైయిమ్‌లు తక్షణం పరిష్కరించాలి. గత ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

**- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ**


### • ఆయిల్‌పామ్ రైతులను ఆదుకోండి



గోపాలపురం నియోజకవర్గంలో 60 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు న్నాయి. ఇక్కడి రైతులకు ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలి. పొలాల మధ్యలో విద్యుత్ లైన్ల వల్ల కార్మికులు, రైతులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడుతున్నారు. విద్యుత్ లైన్‌ల వల్ల అక్కడ పంట వేయలేని పరిస్థితిలో సాగు విస్తీర్ణం తగ్గుతోంది. లైన్ల మార్పుపై రైతులపై భారం లేకుండా చూడాలి. విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న రైతులకు 25 కేవీ లేదా 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తే వారిని ప్రోత్సహించినట్లు అవుతుంది.

**- గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు**

### • మునిసిపల్ పన్నులు సవరించాలి



ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాల పన్నులు, ఆస్తి పన్నులు సవరించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ఏ మునిసిపాలిటీలోను లేని విధంగా ఇక్కడ కార్పొరేషన్ పరిధిలో ఖాళీ స్థలాలపై పెద్ద మొత్తంలో పన్ను వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల భవనాల విలువకంటే ఎక్కువ పన్ను విధించడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కార్పొరేషన్‌లో ఏడు గ్రామాలు విలీనమైన తర్వాత అయా గ్రామాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. వాటికి మూడున్నరేళ్ల పన్ను ఇప్పుడు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం పరిశీలించి భవనాలకు, వేకెండ్ ల్యాండ్‌కు ఒకే విధంగా పన్నులు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

**- ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి**

ఏలూరు కార్పొరేషన్‌లో పన్నుల సవరణ చేసేలా పరిశీలన చేస్తామని రెవెన్యూ మంత్రి ఎ.సత్యప్రసాద్ హామీ ఇచ్చారు.

### • రహదారుల నిర్మాణాలకు నిధులివ్వండి



ఉంగుటూరు నియోజకవర్గంలో వంతెనలు, రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలి. నియోజకవర్గంలో కాలువలు పూడిపోయి ఆక్రమణలకు గురయ్యాయి. ప్రక్షాళనకు నిధులు ఇవ్వాలి. నారాయణపురం, గణపవరం వంతెనలతోపాటు నియోజకవర్గంలో ఐదు ప్రధాన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. 198 కిలోమీటర్ల రహదారులు నిర్మించాల్సి ఉంది.

**- ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు**

ఉంగుటూరు నియోజకవర్గంలో వంతెనల నిర్మాణం, మరమ్మతులపై ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని ఆర్అండ్‌బీ మంత్రి జనార్దనరెడ్డి సమాధానం ఇచ్చారు.

### • సంక్షేమంతోపాటు రోడ్లు అభివృద్ధి చేయాలి



సంక్షేమంతోపాటు అభివృద్ధి వైపు చూడాలి. తాడేపల్లిగూడెం నియోజక వర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించారు. పనులు ప్రారంభిం చాలంటే కాంట్రాక్టర్లు పాత బిల్లులు ఇమ్మంటు న్నారు. రోడ్లు భవనాల శాఖా మంత్రి తాడేపల్లిగూ డెం నియోజకవర్గానికి నిధులు విడుదల చేయాలి. లేకపోతే గత ప్రభుత్వ పంథానే కూటమి అనుసరిస్తుందనే అపోహలు ప్రజల్లోకి వెళుతున్నాయి. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

**- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**

### • యనమదుర్రు వంతెనలకు అప్రోచ్ నిర్మించాలి



భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలు నిర్మించినా అప్రోచ్ రోడ్లు వేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. అప్రోచ్ రోడ్ల విషయంపై నాలుగుసార్లు సంబంధిత మంత్రి దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకుని వెళ్లాం. వంతెనలకు అప్రోచ్ రోడ్లు పూర్తిచేస్తే భీమవరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చు.

**- భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి అంజిబాబు**

### • కైకలూరులో రహదారులు అధ్వానం



కైకలూరు నియోజకవర్గంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క రోడ్డు నిర్మించకపోవడంతో అవన్నీ ధ్వంసమయ్యాయి. కూటమి ప్రభుత్వం చాలా వరకు అభివృద్ధి చేసినప్పటికీ మా నియోజకవర్గంలో ఇంకా కొన్నిఅధ్వానంగానే ఉన్నాయి. 1.2 లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉండడంతో నిత్యం 40 టన్నుల లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారులు మెరుగు పరచాలి. ఆక్వా చెరువులు ఉన్న ప్రాంతాలపై ఆలోచన చేయాలి.

**- కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్**

తణుకు/ద్వారకాతిరుమల/ఏలూరు టూటౌన్/నిడమర్రు/తాడేపల్లిగూడెం/భీమవరం టౌన్/కైకలూరు(ఆంధ్రజ్యోతి):

### పదోన్నతులు కల్పించండి.. వీఆర్వో సంఘం వినతి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రేడ్ వన్ వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులను రెండేళ్లుగా ఇవ్వకపోవడం వల్ల అన్యాయం జరుగుతోందని వివరించారు. పదోన్నతుల విషయంలో ఇప్పటికే అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులు అర్హులైన గ్రేడ్ 1, వీఆర్వోలతో భర్తీ చేయాలని కోరారు. గ్రేడ్ 2 వీఆర్వోలకు ప్రొబిషన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో సర్వే ఎగ్జామ్స్, సీసీటి, పాసైన వారికి వెంటనే ప్రొబిషన్ డిక్లేర్ చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, రవికుమార్, ఎ.ప్రభాకర్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

# లోటుపాట్లు రానివ్వద్దు

- 25న వెలగపూడిలో నియామక పత్రాలు అందుకోనున్న మెగా డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులు
- ఏలూరులో వసతి, ప్రయాణ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష
- నేడు 10 పాఠశాలలు, హాస్టళ్లకు 2400 మందికి పైగా అభ్యర్థులు, సహాయకుల రాక.. హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు



వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న వెలగపూడిలో నియామక పత్రాలు అందజేసేందుకు ఏలూరు నుంచి తీసుకెళ్ళే ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు తలెత్తరాదని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో డీఎస్సీ అభ్యర్థులకు ఏలూరులో వసతి, ప్రయాణ ఏర్పాట్లపై విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఆర్టీసీ, పోలీసు, రెవెన్యూ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన 1063 మంది, జోనల్ పోస్టులను ఎంపికైన 168 మందిని కలిపి మొత్తం 1231 మంది అభ్యర్థులకు 25న వెలగపూడిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను ముఖ్యమంత్రి అందజేయనున్నారని వివరించారు. అభ్యర్థులతోపాటు మరొకరు తోడుగా ఉండేలా ఏలూరు నుంచి అమరావతికి తీసుకెళ్లి, తిరిగి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులతోపాటు, వారి వెంట వచ్చే సహాయకులకు ఏలూరులో బస చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, బుధవారం రాత్రి భోజనం, గురువారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ అభ్యర్థులు, వారి వెంట వచ్చే సహాయ కులు బుధవారం సాయంత్రం 4 గంటలకు వారికి కేటాయించిన రిసీవింగ్ సెంటర్ల (పాఠశాల/ వసతిగృహం) లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. హాల్ టిక్కెట్, కాల్ లెటర్, ఆధార్ కార్డు, ఫోటోను అభ్యర్థి తీసుకురావాలని, వారి వెంట వచ్చే సహాయకులు ఆధార్ కార్డు, ఫోటోను తీసుకురావాలి. ఏలూరులో బుధవారం రాత్రి బసకు దుప్పట్లు, ఇతర సామగ్రిని అభ్యర్థులే తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. వసతి, ప్రయాణ ఏర్పాట్ల సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ నంబర్లు 98668 23873 (కె.రాంబాబు), 91214 99645 (సీహెచ్.సీతా మహాలక్ష్మి)లలో సంప్రదించాలని కోరారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, డీఎంహెచ్‌వో డాక్టర్ అమృ తం, డీపీటీవో షబ్నం, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

**7 పాఠశాలల్లో పురుష అభ్యర్థులకు వసతి**

పురుష అభ్యర్థుల వసతికి ఏలూరులో 7 పాఠశాలలను కేటాయించారు. అభ్యర్థులు, వారి సహాయకులకు బుధవారం రాత్రి భోజనం, గురువారం ఉదయం అల్పాహారం అందించే ఏర్పాట్లను ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్‌కు, గురువారం మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలులోని ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల నుంచి చేసేలా అప్పగించారు. భోజన ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.300లు చొప్పున వెచ్చిస్తున్నట్లు తెలిసింది. మినహాయింపులు పొందిన అభ్యర్థులు పోను సుమారు 2400 మందికి పైగా బుధవారం ఏలూరులో వారికి కేటాయించిన రిసీవింగ్ సెంటర్లలో రిపోర్టు చేయాల్సి ఉంది. అభ్యర్థుల వారీగా వసతి, ప్రయాణ ఏర్పాట్లను కల్పించేందుకు పర్యవేక్షణ నిమిత్తం ఇప్పటికే నియమించిన ఎంఈవో, సీనియర్ హెచ్‌ఎంలు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులతో కూడిన బృందాలు యథాతథంగా పనిచేస్తాయి.

### మహిళా అభ్యర్థులకు వసతి గృహాల్లో బస

డీఎస్సీకి ఎంపికైన మహిళా అభ్యర్థులందరికీ వసతి, ప్రయాణ ఏర్పాట్లను సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టళ్లలో కల్పించేలా ఎంపిక చేశారు. మొత్తం 700 మంది మహిళల కోసం వట్లూరు మెయిన్ బైపాస్‌పై వున్న ఏపీ సోషల్ వెల్ఫేర్, ఏలూరు అమీనాపేటలోని బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను ఖరారు చేశారు. ఎవరెవరికి ఎక్కడెక్కడి వసతి గృహాలను కేటాయించిందీ ఫోన్ల ద్వారా సమాచారమిచ్చారు. బాలికల హాస్టళ్లలో మహిళా అభ్యర్థులు రాత్రి నిద్రించేందుకు మంచాలున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని ఎంపిక చేసినట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు మొత్తం 31 మందికి ఉద్యోగ నియామక పత్రాల అంద జేత కార్యక్రమానికి హాజరు కానవసరం లేకుండా మినహాయింపు నిచ్చారు.

# లాంఛనాలు భరించలేం !

- తనిఖీల పేరుతో తూనికలు కొలతల శాఖ వసూళ్లు
- బెంబేలెత్తుతున్న రేషన్ డీలర్లు





(తణుకు రూరల్-ఆంధ్రజ్యోతి)

తూనిక యంత్రాల లోపాలను గుర్తించి సరిచేసేందుకు నిర్వహించే తనిఖీలకు వసూళ్లు నానాటికీ పెరిగిపోవడంతో రేషన్ డీలర్లు, వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో వస్తువులను తూకానికి కేజీల వారీగా ఇనుపరాళ్లను ఉపయోగించేవారు. అయితే వాటిని ఏళ్ల తరబడి ఉపయోగించడం వల్ల అరుగుదల ఏర్పడటంతో అప్పట్లో తూనికలు, కొలతల శాఖ సిబ్బంది ఏటా తనిఖీలు నిర్వహించి లోపాలుంటే వాటిని సరి చేసి సీలు వేసి ఇచ్చేవారు. అందుకు సిబ్బందికి రేషన్ డీలర్లు, వ్యాపారులు ఎంతో కొంత ముట్టజెప్పేవారు.

కాలక్రమేణా అది చట్టబద్ధమైన లాంఛనంగా మారింది. గతంలో 100 కేజీల సామర్థ్యం గల తూనిక యంత్రాలకు 2023 వరకూ లాంఛనం గా రూ.300 ఒక్కో డీలరు, వ్యాపారి నుంచి స్వీకరించే వారని డీలర్లు, వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ లాంఛనం 2023 నుంచి రూ.900 చెల్లిస్తుండగా అది కాస్తా ఈ ఏడాది నుంచి రేషన్ డీలర్లు రూ.1400, వ్యాపారులు రూ.1200లుగా నిర్ణయిం చారని డీలర్లు పేర్కొంటున్నారు. అప్పట్లో ఉపయోగించిన తూకం రాళ్లలో తరుగుదల ఏర్పడితే దానిని భర్తీ చేసేందుకు సీసం, ఇతర పదార్థాలను కరిగించి ఏర్పడిన లోటును భర్తీ చేసేవారు. అందుకయ్యే వ్యయం నిమిత్తం రుసుం వసూళ్లు చేసేవారు. ఇలా ఎన్నిసార్లు తనిఖీలు చేస్తే అన్నిసార్లు వారి నుంచి సంబంధిత శాఖ సిబ్బంది రుసుం వసూళ్లు చేసేవారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాల్లో లోపాలను సరిచే యడం సులభతరమైనప్పటికీ తరుగు, అరుగుదల ఏర్పడేదేమీ లేనప్పటికీ మామూళ్ల రూపంలో వసూలు చేయడం భారంగా మారిందని పేర్కొంటున్నారు.

**వారికి తనిఖీలు ఉండవా?**

లీగల్ మెట్రాలజీ సిబ్బంది రోడ్ల పక్కన, మోటారు సైకిళ్లపై వ్యాపారాలు చేసే సంచార వ్యాపారులు ఉపయోగించే కాటాలను తనిఖీలు చేయరా? అని డీలర్లు, వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఏటా షాపులు, చౌక దుకాణాల నిర్వాహకులపై తరచూ దాడులు చేసి కేసులు నమోదు చేసే తూనికలు, కొలతల శాఖ సిబ్బంది, అధికారులు వీధి వ్యాపారులు, రోడ్డు ప్రక్కన వ్యాపారాలు చేసే వారి తూనిక యంత్రాలను కూడా తనిఖీలు చేయాలని కోరుతున్నారు.

**వసూళ్ల పెంపు దారుణం**



ప్రతి ఏటా చౌక దుకాణాలు నిర్వహించే రేషన్ డీలర్లు ఉపయోగించే తూనిక యంత్రాలకు తనిఖీల పేరుతో సొమ్ములు వసూళ్లు చేయడం భారంగా వుంది. డీలర్ల నుంచి వసూలు చేస్తున్న మొత్తం గత మూడేళ్ల కాలంలో రూ. 300 నుంచి రూ. 1400 పెంచడం దారుణం. దీనిని పునఃపరిశీలించాలి.

**-ఇమ్మంది శంకర రావు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, తణుకు**

### మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ.. మోటార్ సైకిల్ ర్యాలీ

భీమవరం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం భీమవరం అంబేడ్కర్ చౌక్ నుంచి దగ్గులూరు మెడికల్ కళాశాలకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రభుత్వ రంగంలోనే ఉంటే ప్రజలకు, రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు లంకా కృష్ణమూర్తి, కె.మహంకాళి, గంటా సుందర్‌కుమార్, ఈదా శేఖర్‌బాబు, మెడికల్ రిప్రజంటేటివ్‌ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, గాతల జేమ్స్ పెంద్ర వీరన్న, నన్నేటి పుష్పరాజ్, టి. ప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ ప్రసంగించారు. మత్తె రాజ్‌కుమార్, సూడదాసు గంగయ్య, రామాని కాస్త్రో, మల్లుల శ్రీనివాస్, బీఎన్ఎస్ ప్రసాద్, బి.ప్రసాద్, బి.రమేష్, కాకర రాజ్‌కుమార్, బి.వాసుదేవరావు, ఎం. ఆంజనేయులు, ఎం వైకుంఠరావు, మామిడిశెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలను వాహనాల్లో తరలిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, పెదపాడు పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు పోలీసులు మాట్లాడుతూ వాహనాలను, చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

### చెక్ బౌన్స్.. ఏడాది జైలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు ఆర్అండ్‌బీ కార్యాలయంలో గతంలో వాచ్‌మన్‌గా పనిచేసిన పెందిలి షడ్రక్ కుటుంబ అవసరాల నిమిత్తం స్థానికంగా ఉంటున్న గూడవల్లి విద్యా సాగర్ వద్ద 2022వ సంవత్సరం సెప్టెంబరులో రూ.5 లక్షల 50 వేలు అప్పుగా తీసుకున్నారు. ఆ అప్పు తీర్చే క్రమంలో 2023 సెప్టెంబరులో రూ.4లక్షల చెక్కును విద్యాసాగర్‌కు షడ్రక్ అం దజేశారు. ఆ చెక్కును జమ చేసుకునేందుకు బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది.ఈ క్రమం లో దీనిపై విద్యాసాగర్ కోర్టులో కేసు వేశారు. ఏలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో మంగళవారం ఈ కేసుకు సంబంధించి విచారణ చేపట్టారు. చెల్లని చెక్కు ఇచ్చిన నేరం రుజువైనందుకు షడ్రక్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. దీంతో పాటు రూ.4 లక్షలు చెల్లించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.



### విద్యుత్ స్తంభంపై మంటలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై ఉన్న కేబుల్ వైర్లు అకస్మాత్తుగా అగ్ని ప్రమాదానికి గురై మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన ఎలక్ట్రికల్ శాఖాధికారులు విద్యుత్ నిలుపుదల చేశారు.ఏలూరు విజయ్‌విహార్ సెంటర్ సమీపంలో రిలయన్స్ ఎదురుగా ఒక విద్యుత్ స్తంభంపై అకస్మాత్తుగా కేబుల్ వైర్లు మంగళవారం రాత్రి దగ్ధమవడం ప్రారంభమయ్యాయి. మంటలు వ్యాపించడంతో వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకుంది.విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్‌ను నిలుపుదల చేశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖాధికారులు వెల్లడించారు.



ద్వారకాతిరుమల దేవస్థానంలోని టీటీడీ సదనం

### భక్తురాలి పట్ల అసభ్య ప్రవర్తన ?

**తాత్కాలిక ఉద్యోగి తీరుతో కుటుంబ సభ్యుల దేహశుద్ధి**

**విధుల నుంచి తొలగిస్తూ ఈవో ఉత్తర్వులు**

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చి టీటీడీ సదనంలో విశ్రాంతికి దిగిన ఓ భక్తురాలితో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో దేవస్థానం అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నారాయణను విధుల నుంచి తొలగించారు. విశాఖకు చెందిన ఓ కుటుంబం సోమవారం సాయంత్రం స్వామి దర్శనానికి క్షేత్రానికి వచ్చారు. టీటీడీ సదనంలోని గదిని అద్దెకు తీసుకున్నారు. వారితో సత్రం గుమస్తాగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నారాయణ చనువుగా ఉన్నాడు. ఇలా ఉండగా సోమవారం సాయంత్రం కుటుంబంలోని ఓ మహిళకు జ్వరంవచ్చింది. వారితో మాట్లాడిన గుమస్తా మంగళవారం తెల్లవారు జామున 'జ్వరం తగ్గిందేరా' అంటూ చెయ్యి పట్టుకున్నట్టు ఆమె ఆరోపించింది. అదే సమయంలో ఆగ్రహంతో అతడిని కొట్టింది. కుటుంబ సభ్యులు సైతం నారాయణకు దేహశుద్ధి చేశారు. దీనిపై ఆలయ అధికారులకు భక్తురాలు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన అధికారులు విచారణ జరిపి అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నారాయణను విధుల నుంచి తొలగించారు.ఈ ఘటనపై ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి వివరణ ఇస్తూ భక్తురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం నారాయణను విధుల నుంచి తొలగించినట్టు తెలిపారు.

### చేసిన అప్పు తీర్చలేక ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి పురుగు మందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. ద్వారకాతిరుమల మండలం లైను గోపాలపురానికి చెందిన శృంగ వృక్షం నాగరాజు(33)భార్య, ఇద్దరు పిల్లలున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వివిధ అవసరాల నిమిత్తం పలువురి వద్ద రూ.5 లక్షల వరకు అప్పుచేశాడు. ఆ అప్పు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

### రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని చినఔట్‌పల్లి దగ్గరలో వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక వ్యక్తి(40) జారిపడి నుజ్జునుజ్జు అయిపోయాడు. మృతుడు ఛామనఛాయ శరీరంతో 5 అడుగులు ఎత్తు కల్గి ఉన్నాడు. ట్రెయిన్ వేగంగా వెళ్తున్న సమయంలో కిందపడటంతో మృతుడి శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయని ప్రాథమికంగా అంచనా వేశారు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి శరీర భాగాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అతను రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

### పుట్టినరోజు వేడుక క్షణాలు చెరిగిపోకుండానే..

**రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి**



లారీ కిందపడి మృతి చెందిన సాయి ప్రకాశ్

పెదపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు జరుపుకున్న మధుర క్షణాలు కుటుంబ సభ్యులు, బంధువుల కళ్లముందు కదలాడుతుండగానే అతడిని రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో కబళించింది. మండవల్లి మండలం ఇంగిలంపాకలంక గ్రామానికి చెందిన ఘంటసాల సాయిప్రకాశ్(23) డిగ్రీ పూర్తి చేసి విజయవాడలోని ప్రైవేటు సంస్థలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21న పుట్టినరోజు కాగా, కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకునేందుకు స్వగ్రామానికి వచ్చాడు. తిరిగి మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో మోటారు సైకిల్‌పై విజయవాడ బయల్దేరాడు. సుమారు 9 గంటల ప్రాంతంలో పెదపాడు మండలం కలపర్రు టోల్ గేట్ సమీపంలోకి వచ్చేసరికే తణుకు నుంచి చాట్రాయి వైపు అట్టల లోడుతో వెళుతున్న లారీ వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సాయి ప్రకాశ్ లారీచక్రాల కింద నలిగి తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు.సాయిప్రకాశ్ చిన్నాన్న మోరు వెంకట శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్.సి. వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వృద్ధ దంపతుల కాళ్లూ.. చేతులు కట్టేసి..

**30 కాసుల బంగారం, వెండి వస్తువులు చోరీ - కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు**



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో ముగ్గురు గుర్తు తెలియని దుండగులు ఓ ఇంట్లోకి ప్రవేశించి వృద్ధ దంపతులను బంధించి 30 కాసుల బంగారం, వెండి వస్తువులు దోచుకుపోయిన ఘటన మంగళవారం కలకలం సృష్టించింది. లక్కవరం గ్రామానికి చెందిన వందనపు రుక్కయ్య, అంజనీకుమారి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలిద్దరికి వివాహాలు జరిగాయి. ప్రస్తుతం ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటున్నారు. లక్కవరంలోని తమ ఇంటిలో వృద్ధులిద్దరే ఉంటారు. మంగళవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ఇంటి తలుపును తొలగించి ముగ్గురు దుండగులు లోపలికి ప్రవేశించారు. మొదట బెడ్ రూంలో వెతికారు. ఏమీ దొరక్కపోవడంతో వృద్ధ దంపతులు నిద్రిస్తున్న రెండవ బెడ్ రూంలోకి ప్రవేశించారు. అలికిడి విని నిద్రలేచి ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ఇద్దరి నోరు మూశారు. వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారమంతా తీసుకున్నాడు. తరువాత వారితో బీరువా ఓపెన్ చేయించి అక్కడే ఉన్న టవల్స్‌తో వారి చేతులు, కాళ్లు కట్టేసి బీరువాలోని బంగారం, వెండి వస్తువులు తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. చంపుతామని బెదిరించడంతో వృద్ధ దంపతులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దొంగలు అడిగినవన్నీ ఇచ్చేశారు. గదిలో లైట్లు వేయకుండా వారి వెంట తెచ్చుకున్న బ్యాటరీ లైట్ల వెలుగులోనే తమ పనంతా పూర్తి చేశారు. దుండగులు వెళ్లిపోయిన వెంటనే కట్లు విప్పుకుని వృద్ధుడు రుక్కయ్య స్థానికుల సహకారంతో లక్కవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన డీఎస్పీ యు.రవిచంద్ర ఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములు వచ్చి దర్యాప్తు చేపట్టాయి. ఈ సందర్భంగా డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ వృద్ధ దంపతులను బంధించి, బెదిరించి దోపిడీకి పాల్పడిన దుండగుల కోసం గాలిస్తున్నామని, అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ తెలిపారు.

### ఈత కొట్టేందుకు చెరువులో దిగి బాలుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సరదాగా ఈత కొడదామని చెరువులోకి దిగిన ఓ బాలుడు మృత్యువాత పడ్డాడు. తిరుమలంపాలెంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముత్తే రాజు(14) స్థానిక జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. స్కూళ్లకు సెలవులు కావడంతో తోటి స్నేహితులు మరో నలుగురితో కలిసి చెరువులో ఈత కోసం దిగారు.చెరువులో ఉన్న మట్టి తవ్వకాల గోతిలో పడిన రాజు మునిగిపోయాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన గండికోట సుబ్బారావు కేకలు వేయడంతో పిల్లలు బయటకు వచ్చి రాజు అందులో మునిగిపోయాడని చెప్పి వెళ్లిపోయారు. దీంతో సుబ్బారావు అందులోకి దిగి రాజును బయటకు తీసుకొచ్చాడు. బాలుడు అప్పటికే మృతిచెందాడు. గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు బంధువులు అక్కడకు చేరుకుని మృతదేహం వద్ద రోధించారు.

## ఆధునిక పద్ధతులతో సాగు చేపట్టాలి : దైవ ఆశీర్వాదం

నిడమర్రు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయం లాభసాటిగా చేసుకోవచ్చని నిడమర్రు మండల వ్యవసాయాధికారిణి అంగర దైవ ఆశీర్వాదం అన్నారు. మంగళవారం ఎనికేపల్లి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం వారిచే సరఫరా చేయబడిన డ్రోన్లు వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలి : బత్తిన నాగలక్ష్మి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ అన్నారు. పేరంపేట రోడ్డులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వస్థ్ నారీ సశక్తి పరివార్ వైద్య శిబిరం మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, కౌన్సిలర్ తెలగారపు జ్యోతి, గుమ్మడి ప్రసాద్, బీజేపీ నాయకుడు కొప్పాక శ్రీనివాసరావు, జనసేన నాయకుడు వలవల తాతాజీ పాల్గొన్నారు.

## వేతన ఒప్పందానికి యాజమాన్యాల అంగీకారం

పెదవేగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం వంగూరులోని గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్మికులు పోరాడి వేతన పెంపును సాధించుకున్నారు. జీతాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో అనుబంధ గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్మికులు ఏప్రిల్ నెలలో యాజమాన్యానికి విన్నవించారు. అయినా యాజమాన్యం ముందుకు రాకపోవడంతో కార్మికులు దశలవారీగా ఆందోళన చేపట్టారు. దీంతో కార్మిక యూనియన్ నాయకులకు, యాజమాన్యానికి మధ్య దఫదఫాలుగా చర్చలు జరిగాయి. చివరకు డీసీఎల్ శ్రీనివాస్ సమక్షంలో మంగళవారం మరోసారి జరిగిన చర్చల్లో వేతన పెంపునకు యాజమాన్యం అంగీకరించిందని ఇఫ్టూ నాయకుడు యు.వెంకటేశ్వరరావు(యూవీ) తెలిపారు. ఈ చర్చల్లో యాజమాన్యం తరపున అకౌంట్స్ మేనేజర్ శ్రీనాథ్, కాంట్రాక్టర్ శ్రీనివాస్, కార్మికుల తరపున యూనియన్ నాయకులు యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, బెజవాడ పద్మ, ఆలీసమ్మ, రంగమ్మ, బేబీ, సుజాత, రాణి, కృప, లక్ష్మీ, మోతీభవానీ, కోటేశ్వరరావు, సత్యవతి, సావిత్రి పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి : కలెక్టర్

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థయిర్యంతో జీవించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో బదిరుల సంకేత భాషా దినోత్సవం నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులతో కలెక్టర్ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భాష ఏదైన భావవ్యక్తీకరణ ఒక్కటేనన్నారు. బదిరులు చేతి సైగలతో భావవ్యక్తీరణ చేయడం గొప్ప విషయమన్నారు. బదిరిల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. జడ్పీ సీఈఓ శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డిజేబుల్డ్ ఏడీ రామ్‌కుమార్, సెట్‌వెల్ సీఈఓ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## 26న కేవీఎస్ అవార్డు ప్రదానం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హిందూ యువజన సంఘం వైఎంహెచ్‌ఏ, కేవీఎస్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో కళారత్న కె.వి.సత్యనారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న కేవీఎస్ ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్టు కళారత్న కేవీ సత్యనారాయణ తెలిపారు. మేలట్టూరు భరతం మహాలింగం నేతృత్వంలో శిక్షణ పొందిన ఎస్.నాగరాజన్, డాక్టర్ ఎస్.అరవింద సుబ్రహ్మణ్యం, నృత్య రూపకాల్లో నిష్ణాతులైన ఇద్దరికి కేవీఎస్ ఎక్సలెంట్ అవార్డులను అందజేస్తున్నట్టు ప్రకటించారు. ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, కేకే గుప్తా, కానాల బాల వెంకట రమేష్, ఇరదల ముద్దు కృష్ణ, మజ్జి సూర్యకాంతరావు, ఎల్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కె.ఎస్. రామవరంలో పోషణ అభియాన్

కామవరపుకోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసంగా ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మంగళవారం కె.ఎస్.రామవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద పరిశీలించారు. పోషకాహార పదార్థాలు, అవగాహన బొమ్మల తయారీ, స్థానిక వంటల ప్రదర్శనను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థూలకాయం నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించాలన్నారు. బాల్యదశ సంరక్షణ, విద్యా పోషణ్‌లో శిక్షణ పొందాలన్నారు. గ్రామీణ పోషణకు బలమైన పునాది అన్నారు. జంగారెడ్డిగూడెం సీడీపీవో బ్యూలా, సూపర్‌వైజర్లు బి.వి.ఎల్.మంగాదేవి, ఎన్.వీరకుమారి పాల్గొన్నారు.

## వ్యవసాయంలో సంక్షోభాన్ని పరిష్కరించాలి : శ్రీనివాస్




భీమడోలు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వాల విధానాలే కారణమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాస్కరరావు, కె.శ్రీనివాస్ అన్నారు. పూళ్లలో రైతు సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొరతను తీర్చాలని నూతనంగా ఎన్నుకున్న మండల కమిటీ అధ్యక్షుడు పనపల వెంకటేశ్వరరావు, కార్యదర్శి గురజాల కృష్ణ బాలాజీ, ఉపాధ్యక్షుడు గోడవర్తి రామారావు, మడపాని సత్యనారాయణలతో నిరసన తెలిపారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ తనిఖీలు

కామవరపుకోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కామవరపుకోటలోని ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఎస్.ఐ కె.నాగరాజు, మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు బృందం స్థానిక కొండూరు రామమోహనరావు, కొండూరు నాగేశ్వరరావు, బచ్చు వీరవెంకటేశ్వరరావులకు చెందిన ఎరువుల షాపులను పరిశీలించి ఎరువు నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం విజిలెన్స్ అగ్రికల్చరల్ అధికారులు మాట్లాడుతూ ప్రతిషాపు వద్ద ప్రతిరోజు స్టాకువివరాలను కనిపించేలా ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వ్యక్తికి బిల్లులను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

## సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలి : డీఎస్పీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ విద్యార్థినులకు సూచించారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో శక్తిటీమ్ సభ్యులు ఏలూరు అమీనాపేట సాంఘిక సంక్షేమ మహిళా వసతి గృహాలకు వెళ్లే మార్గంలో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఏలూరు డీఎస్పీ మాట్లాడుతూ సమస్యలుంటే చెప్పాలన్నారు. అత్యవసర సమయంలో పోలీస్ సహాయాన్ని పొందడానికి 112 డయల్ చేయాలని సమాచారం ఇచ్చిన పది నిముషాల్లో పోలీసులు చేరుకుంటారన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా 181 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారని, గృహహింస, వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడితే ఫిర్యాదు చేయవచ్చన్నారు. శక్తి యాప్ నెంబర్ 7993485111 మహిళల భద్రత కోసం ఏర్పాటు చేశారని సూచించారు. శక్తియాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే తక్షణం పోలీసులు వస్తారని సూచించారు. అత్యవసర సమయాల్లో ఏం చేయాలో డీఎస్పీ సూచించారు. ఆత్మరక్షణ పద్ధతులైన కరాటే, జూడో వంటి వాటిని నేర్చుకుని తమను తాము రక్షించుకోవచ్చన్నారు. మహిళా ఎస్ఐ నాగమణి, శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## అయ్యా పింఛన్ ఇప్పించండి.. కదలలేకపోతున్నా..



పెదవేగి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడుతున్నాను.. ఏ పనీ చేయలేని స్థితిలో పింఛను ఇప్పించండని ఓ వృద్ధుడు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు విన్నవించుకున్నాడు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అదే సమయంలో వట్లూరు పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన రాయవరపు రామాచారి అనే వృద్ధుడు పక్షవాతంతో బాధపడుతూ వికలాంగుల కోటాలో పింఛను ఇప్పించాలని ఎమ్మెల్యే ప్రభాకర్‌ను వేడుకున్నాడు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభాకర్ అవసరమైన చర్యలకు అధికారులను ఆదేశించారు. పూర్తిగా లేవలేని స్థితిలో ఉన్న రామాచారికి పింఛను వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చెట్ల పొదల తొలగింపు

కుక్కునూరు, సెప్టెంబరు 23( ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్, జూనియర్ కాలేజీ సమీపంలోని టి.మార్క్ జంక్షన్ వద్ద పొదలు అధికంగా పెరిగిపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి.ఈ సమస్యను గుర్తించిన కుక్కునూరు పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సుకుమార్ ముందుకొచ్చారు. ఎక్స్‌వేటర్ సాయంతో పొదలు తొలగించి ఆ రహదారికి ఇరువైపుల ఉన్న పొదలు తొలగించారు. దీంతో రహదారి సురక్షిత మారింది. ఎస్.ఐ. రాజారెడ్డి కానిస్టేబుల్‌ను అభినందించారు.



నిడమర్రులో అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా కనకదుర్గాంబ



పత్తేబాదలోని కనకదుర్గమ్మ,



కె.కోటలో బాలా త్రిపుర సుందరీదేవి..



భీమడోలులో దుర్గమ్మ..



చింతలపూడిలో అన్నపూర్ణ

# అమ్మా దీవించు..

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో దేవీనవరాత్రులను మంగళవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. అంబికాదేవి, శ్రీసౌభాగ్య లక్ష్మీ దేవి, పత్తేబాద కనకదుర్గమ్మకు గాయత్రీ దేవిగా అలంకరించి దర్శనమిచ్చారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కూచిపూడి శ్రీనివాస్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిన నాగేశ్వరరావు, ఆలయ అర్చకులు యడవల్లి శ్రీహరిశర్మ అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. నవరాత్రుల్లో భాగంగా మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● కామవరపుకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ప్రారంభమైన దేవీ నవరాత్రులు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. నవరాత్రుల్లో అమ్మవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కామవరపుకోటలోని శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో లలితాదేవికి బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో శ్రీచక్రానికి క్షీరాభిషేకం జరిపించి సామూహిక కుంకుమార్చనలు జరిపారు.

### రెండోరోజు ఘనంగా దేవీ నవరాత్రులు

● టి.నర్సాపురం: దసరా శరన్నవరాత్రులు మండలంలో వాడవాడల ఘనంగా నిర్వహిస్తున్నారు. 2వ రోజు మంగళవారం అమ్మవారిని గాయిత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలదేవి పేట, టి.నర్సాపురం కనకదుర్గమ్మ ఆలయం, గీతామందిరం వద్ద, మక్కినవారిగూడెం, బొర్రంపాలెం, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం, తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● బుట్టాయగూడెం: దసరా మహోత్సవాల్లో భాగంగా మన్యంలో ఉన్న గుబ్బల మంగమ్మను మంగళవారం పసుపు కొమ్ములతో ఆలయ కమిటీవారు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుట్టాయగూడెం త్రిశక్తి పీఠం, రెడ్డిగణపవరంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారు మంగళవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.



తిరుమలదేవిపేటలో అమ్మవారి సన్నిధిలో మహిళలు

● జంగారెడ్డిగూడెం: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఆయా అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రెండవ రోజు సందర్భంగా గంగానమ్మ అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన కుంకుమ పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

● నిడమర్రు: దసరా శరన్నవరాత్రి వేడుకలు మందలపర్రులోని ఉమానీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో ఘనంగా జరుగుతున్నాయి. ఉమాదేవి అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో దర్శనమిచ్చారు.

● భీమడోలు: మండలంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భీమడోలు గ్రామంలోని గుర్రాలచెరువు సమీపంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మను దర్శించుకున్నారు.

# వైద్య శిబిరాలు వినియోగించుకోండి



రాజుపోతేపల్లిలో నిర్వహించిన స్వస్థ్ నారీ శిబిరం

టి.నర్సాపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజుపోతేపల్లి సబ్ హెల్త్ సెంటర్ పరిధిలో అలాగే బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల పర్యవేక్షణలో మంగళవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ సభ్యులు వెంకటచలపతిరావు, గండబోయిన నాగేంద్ర రావు(శ్రీను)లు పాల్గొన్నారు. రాజుపోతేపల్లిలో వైద్యాధికారిణి కల్పనరాణి, బొర్రంపాలెంలో వైద్యాధికారి ఎ.ఎం. ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో దావులూరి సూర్యనారాయణ, ముసులూరి బాలస్వామి, సీహెచ్‌ఓ ఎస్. విజయరామరాజు, సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ, బొర్రంపాలెంలో గండబోయిన వెంకట్రావు, కంపసాటి రమేష్, జట్ల రాంబాబు, మద్యాహ్నపు నాగార్జున పాల్గొన్నారు.

### గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్
### వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ

● పెదవేగి: కుటుంబంలో తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని స్థానిక వీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కూచింపూడిలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మహిళలకు ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం వికాసవంతంగా ఉంటుందన్నారు.అంగన్‌వాడీ సెక్టారు సూపర్‌వైజర్ సి.హెచ్.పార్వతి, పీహెచ్‌ఎన్ నాగమణి, హెచ్.వి.యామిని, ఎంఎల్‌హెచ్‌పీలు జయ, మాధురి, హెల్త్ అసిస్టెంట్ వేణు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన దివాణం వీధిలోని శిబిరంలో అమ్మవారికి రెండో రోజు గాయత్రీ దేవిగా అలంకరణ చేసి పూజలు జరిపారు. వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. పలు పీఠాల్లో గాయత్రీదేవి అలంకరణ చేశారు.

● బుట్టాయగూడెం: పులిరాముడుగూడెంలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు ఆకాంక్ష, సతీశ్, భార్గవ్ వైద్య శిబిరం ఏర్పాటు చేసి గిరిజనులకు వైద్య సేవలందించారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నం నాగేశ్వరావు, సిహెచ్‌వో జ్ఞానపాప, పీహెచ్‌ఎన్ నాగపూర్ణిమ పాల్గొన్నారు.

● నిడమర్రు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని పెదనిండ్రకొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వర్మ అన్నారు. మంగళవారం గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు అధ్యక్షతన వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

● పెదపాడు: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెదపాడు మండలం సకలకొత్తపల్లి గ్రామ సర్పంచ్ లావేటి హేమసుందర్ పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొని మహిళలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది పలిశెట్టి శ్రీనివాసరావు, గజ్జెల రాము పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

## సీహెచ్‌సీ నిర్మాణానికి టీడీపీ నాయకుల స్థలం పరిశీలన

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల పీహెచ్‌సీని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కృషితో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో.. ఈ మేరకు అవసరమైన స్థలాన్ని టీడీపీ ముఖ్యనేతలు మంగళవారం పరిశీలించారు. సీహెచ్‌సీ నిర్మాణానికి షుమారు రెండెకరాల స్థలం అవసరమవుతుంది.ఈ మేరకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని రాష్ట్ర కమ్మకార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు(పీఎస్ఆర్), మాజీ ఎంపీపీ ఏఘూరి దాలయ్య, తహసీల్దారు జేవీ సుబ్బారావు, డీటీ మహలక్ష్మి, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. గోపాలపురం ఏఎంసీ వైస్ చైర్మన్ పి ధర్మరాజు పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## పొగాకు రైతుల్లో ఆనందం

కొయ్యలగూడెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతులంతా ఆనందంగా ఉన్నారని పొగాకుబోర్డు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు రైతులు క్షీరాభిషేకం చేశారు. పొగాకు రైతులు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, అడపా సత్తిబాబు, అన్నంరెడ్డి సత్యనారాయణ, బోసు, పారేపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, పల్లి గణపతి పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదవారిని ఆదుకోవడమే టీడీపీ ప్రధాన లక్ష్యమని పార్టీ పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అన్నారు. పట్టణంలోని రాజీవ్ నగర్‌కు చెందిన మర్రిపూడి సూర్యప్రకాశ్ కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం బాధితుడు సూర్య ప్రకాశ్‌ను నాయకులు పరామర్శించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, టీడీపీ నాయకుడు బూరుగుపల్లి సూరిబాబు చేతులమీదుగా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు పింఛన్ వచ్చేలా చూడాలని కిశోర్‌ను కోరగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి పింఛన్ వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న దేవస్థానంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు జరిపించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రతి రోజూ ఈ వైద్య కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తారని దేవాలయ కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి కోరారు. ఈ సందర్భంగా జంటగోపురాల వద్ద కల ఉచిత శిబిరంలో వైద్యులు ఆర్.రాజేంద్రప్రసాద్, దుర్గాప్రసాద్‌లు దాదాపు 60మంది కార్మికుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

## లయన్స్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): లయన్స్ జిల్లా 316జి, ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ పర్వతనేని సుభాష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా "వన్ డిస్ట్రిక్ట్ - వన్ యాక్టివిటీ" అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో వివిధ లయన్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువైన నోట్ పుస్తకాలను పేద విద్యార్థులకు అందజేస్తారు. క్లబ్ అధ్యక్షులు బి.వి.వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా గవర్నర్ ఎన్‌వివిఎస్ పాపారావు నాయుడు, మల్టీపుల్ కౌన్సిల్ నాయకులు డా.వి.కె. పంకజాక్షన్, కాకరాల వేణుబాబు, ఉప గవర్నర్లు డి. సుబ్బారావు, ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, మోహనరావులు మాట్లాడారు. ఎస్.కామేశ్వరరావు, ఎల్ వెంకటేశ్వరరావు, కె.రామలింగేశ్వరరావు, కె.బి.రావు, జి. కూర్మాశ్రీనివాస్, వి.సత్య స్వరూప్, సి.హెచ్.అవినాష్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## గుడివాక లంకలో నేత్ర శిబిరం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కంటి సంబంధిత వ్యాధులను ముందస్తుగా గమనించి తగిన వైద్యం చేయించుకోవాలని రవికిరణ్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణురాలు హేమలత అన్నారు. రూరల్ మండలం గుడివాకలంక గ్రామంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. డాక్టర్ హేమలత మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. టీడీపీ ఏలూరు మండల ప్రెసిడెంట్ నంబూరి నాగరాజు, టీడీపీ యూనిట్ ఇంచార్జ్ జయమంగళ దొరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఘంటశాల సుబ్రహ్మణ్యం, గుడివాకలంక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమలత

## నేడు వాటర్ ప్లాంట్ ప్రారంభం



దెందులూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం ప్రారంభించనున్నారు. దెందులూరు శివారు సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కలపాల శ్రీహరి ఆసుపత్రి అవరణలో సొంత నగదు రూ.3 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించనున్నారని ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ సుందరిబాబు తెలిపారు. అలాగే దెందులూరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కలపాల శ్రీహరితో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం ఉదయం 9 గంటలకు ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నానిబాబు, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, బ్యాంక్ అధ్యక్షుడు గారపాటి కొండయ్య చౌదరితో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

పెదపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద దాత నల్లబోయిన నాగరాజు, రజని దంపతుల ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు 200మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారన్నారు. మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

## సీఆర్ఆర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు

పెదపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ రాంప్ పథకం కింద ఎంటర్ ప్రన్యూర్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్(ఈఎస్డీపీ) వర్క్‌షాపుకు ట్రైనింగ్ హెడ్ డాక్టరు కె. మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావులు జ్యోతి ప్రజ్వలన చేసి మంగళవారం ప్రారంభించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాలు, వ్యవస్థాపక లక్షణాలను పెంపొందించడం ద్వారా ఉద్యోగ సృష్టికర్తలుగా మారేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, కె.హరిరామకృష్ణం రాజు, హెచ్‌వోడీలు డాక్టరు కె.రాంబాబు, డాక్టరు తేజోమూర్తి, కో-ఆర్డినేటర్ ఎం.శ్రీరామమూర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

## యూరియాకు కొరత లేదు

**యలమర్తి వీర వెంకట సత్యనారాయణ(శ్రీను), సొసైటీ అధ్యక్షుడు, సీతంపేట**



**● సీతంపేట సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాలెన్ని?**

సొసైటీ పరిధిలో పెరుగుగూడెం, చల్లచింతలపూడి, మలకచర్ల, ముప్పవరం, కొత్తగూడెం పరిధిలో 1,650 వేల మంది రైతులు బ్యాంక్ ఖాతాదారులుగా ఉన్నారు.

**● రైతులకు రుణాల పరిస్థితి ఏమిటి?**

సొసైటీ పరిధిలో రూ.30 కోట్ల 40 లక్షల టర్నోవర్ ఉంది. ఈ ఏడాది రూ.4 కోట్ల రూపాయల రైతు నేస్తంతో పాటుగా పంట రుణాలను అందించాం.

**● రైతులకు యూరియా కొరత ఉందా?**

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో సీజన్ ప్రారంభంలోనే యూరియాతో పాటు అన్ని ఎరువులను అందుబాటులో ఉంచాం.

**● ఫిక్సిడ్ డిపాజిట్ ఎంత ఉన్నాయి?**

బ్యాంక్ పరిధిలో రూ.4 కోట్ల వరకు ఫిక్సిడ్ డిపాజిట్‌లు ఉన్నాయి.

**● మీ లక్ష్యం ఏమిటి?**

బ్యాంక్ ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రైతులు తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలి.

(దెందులూరు-ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ..

## సొసైటీని అభివృద్ధి చేస్తాం

**నిమ్మగడ్డ సుధాకర్, సొసైటీ అధ్యక్షుడు, ధర్మాజీగూడెం**



**● మీ సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాలెన్ని?**

ధర్మాజీగూడెం, అయ్యప్పరాజు గూడెం, కలరాయనగూడెం, కొణిజర్ల గ్రామాలున్నాయి.

రుణాలు ఎంతమేరకు ఇచ్చారు?

సొసైటీ పరిధిలో ఆరువందల మంది రైతులున్నారు. టర్నోవర్ రూ.40 కోట్ల రూపాయలుగా ఉంది. ప్రస్తుతం రైతులకు రూ.కోటి 50 లక్షలను రుణాలుగా అందిస్తున్నాం.

**●యూరియా అందుబాటులో ఉందా?**

ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సహకారంతో ఖరీఫ్, రబీ సీజన్‌లకు రైతులకు కావాల్సినంత యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉంచాం. ఎరువులు, యూరియా ఇంకా మరింత రావాల్సి ఉంది.

**● సొసైటీని ఎలా నడిపిస్తారు?**

సొసైటీ పరిధిలోని రైతులు ఇబ్బందులు పడకుండా వారికి పంటరుణాలు, పెట్టుబడి సాయం అందిస్తున్నాం. రైతుల సహకారంలో సొసైటీని మరింతగా అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

(లింగపాలెం-ఆంధ్రజ్యోతి)

## పీ4ను విజయవంతం చేయాలి

పెదవేగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ విషయంలో ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని పెదవేగి ఎంపీడీవో కె.రవికుమార్ సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీ4 కార్యక్రమంపై అవగాహన అవసరమన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

● జీలుగుమిల్లి: పీ4 కార్యక్రమంలో భాగంగా పేదల అవసరాలను గుర్తించేలా సర్వే జరపాలని ఎంపీడీవో టి.నిఖిల్ మధుశరణ్ అన్నారు. ప్రభుత్వం తలపెట్టిన పీ4 కుటుంబాలు గుర్తించేందుకు జీరో పావర్టీ కార్యక్రమం చేపట్టామన్నారు. మండలంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. సర్వేలో గుర్తించిన ప్రతీ కుటుంబానికి వారి అవసరాలకు తగ్గట్టుగా బాధ్యత వహించడం తమ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జీఎస్‌డబ్ల్యుఎస్ యాప్‌లో నమోదు చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 934 కుటుంబాలు గుర్తించామన్నారు.

## పరిశ్రమల యూనిట్ సందర్శన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ విజిట్‌లో భాగంగా మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా కళాశాల డిగ్రీ విద్యార్థినులు విజయరాయిలోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలను సందర్శించారు. పలు విడిభాగాల అసెంబ్లింగ్ ద్వారా వస్తువులు ఎలా రూపొందిస్తారో అవగాహన కలిగించేలా వివిధ విభాగాలను పరిశీలించారు. యూనిట్‌లో భద్రత, నాణ్యతా ప్రమాణాల ప్రాముఖ్యత గురించి నిర్వాహకులు వివరించారు. తరగతి గది అభ్యసనానికి, దానికి కార్యరూపమిచ్చే విధానాలకు అనుసంధానంగా ఫీల్డ్ విజిట్ ఉపకరిస్తుందని ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

కుక్కునూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలేరుపాడు గ్రామ శివారుల్లో అటవీ ప్రాంతంలోని సారా బట్టీలపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడిలో 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న వ్యక్తుల గురించి ఆరా తీస్తున్నామని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఇన్చార్జ్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆంధ్రా సరిహద్దుల్లో నిఘా పెట్టామని తెలిపారు.

## ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో వర్షాలు కురుస్తుండటంతో చేపలు, రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి చేపలు, రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని, ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ తెలిపారు. ఆక్సిజన్ కొరత నివారణకు హైడ్రోజన్ పెరాక్సైడ్ ఎకరానికి కిలో చొప్పున చల్లాలన్నారు. రొయ్యల చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పాలన్నారు. ఆక్సిజన్ టాబ్లెట్లు తగు మోతాదులో చెరువుల్లో వేయాలన్నారు.



## నేడు వృక్షాల వేలం

నూజివీడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గుర్తించిన స్థలంలో ఉన్న వృక్షాలను నేడు ఉదయం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు నూజివీడు సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తెలిపారు. సదరు స్థలంలో సుమారు రూ.25 లక్షలు విలువచేసే టేకు, కొబ్బరి, వేపచెట్లు ఉన్నాయని, ఆసక్తిగల వ్యక్తులు వేలంలో పాల్గొనవచ్చని ఈ సందర్భంగా ఆమె కోరారు.



చిన్నంపేట అంగన్వాడీ కేంద్రం ఆవరణలో నిలిచిన వర్షం నీరు

## నిలిచిన నీటితో చిన్నారుల వెతలు

చాట్రాయి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చిన్నంపేట అంగన్వాడీ కేంద్రం (కోడ్ నెంబరు 89) ఆవరణలో నీరు నిలిచి చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. చాలా రోజుల నుంచి వర్షం నిలిచి ఉండటం వల్ల దుర్వాసన వస్తోందని, దోమలు, ఈగలు పెరిగి చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రం ఆవరణ మెరక చేసి వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ అనుబంధ మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొమ్ము ఆనందం విజ్ఞప్తి చేశారు.



గోపవరంలో అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

## పీజీఆర్ఎస్ అర్జీలపై సబ్ కలెక్టర్ విచారణ

ముసునూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గోపవరంలో నివాస గృహాల మధ్య అనుమతుల్లేకుండా ఆలయం నిర్మిస్తున్నారని, నిర్మాణం ఆపాలన్న ఫిర్యాదుపై దేవదాయ శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. గుడి నిర్మాణంపై కోర్టు స్టే ఉండడంతో నిర్మాణం జరగకుండా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. అలాగే కాట్రేనిపాడుకు చెందిన రైతు అక్కినేని రామచంద్ర ప్రసాద్ తన పొలం నుంచి వర్షపునీరు వెళ్ళే కాలువ ఆక్రమణకు గురైందని, ఆక్రమణలు తొలగించాలని ఇచ్చిన అర్జీపై విచారణ చేపట్టారు. సంబంధిత భూ రికార్డులను పరిశీలించిన సబ్ కలెక్టర్ వెంటనే ఆక్రమణ తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దాసరి ప్రశాంతికి సబ్ కలెక్టర్ సూచించారు. బలివే ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదం.. దివ్య ఔషధం



తహసీల్దార్‌కు ఔషధ మొక్కను అందజేస్తున్న రమేష్

ఆగిరిపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం వల్ల సహజ వైద్యం లభించడమే కాక మానవుల ఆయుష్షు పెరుగుతుందని గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కోలేటి పాల్ రమేష్ అన్నారు. ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆగిరిపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలో పలు ఆయుర్వేద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ ఆయుర్వేద మొక్కల పెంపకంతో గృహ వైద్యం సాధ్యమవుతుందన్నారు. ఆశా వర్కర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి చెరువుకు మోక్షం



మండవల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మోకసా కలవ పూడి మంచినీటి చెరువుకు మోక్షం లభించింది. మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో చెరువు పూడికతీత పనులను ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, కూటమి నాయ కులు చాపరాల దుర్గాప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. చెరువులో నీళ్లు పెట్టిన మూడు నెలల్లోనే ఖాళీ అవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 25 ఏళ్ళ తరువాత పూడిక తీయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బొప్పన జగదీష్, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## వరిలో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి


ముసునూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని, మండల వ్యవసాయ అధికారి ఎ. చాముండేశ్వరి అన్నారు. మంగళవారం కొర్లకుంట, ముసునూరులో పొలం పిలుస్తోందిలో భాగంగా క్షేత్రస్థాయిలో వరి పంటను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ వరి ప్రస్తుతం పొట్టదశకు చేరుకున్న నేపథ్యంలో రైతులు పొటాష్, అమ్మోనియం ఫాస్ఫేట్ ఎరువులను వేసుకోవాలన్నారు. కాండం తొలిచే పురుగు, దోమ ఆశించకుండా పురుగు మందులను సమపాళ్ళల్లో పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంటను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు.

## పుట్టినరోజు వేడుక క్షణాలు చెరిగిపోకుండానే..

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెదపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు జరుపుకున్న మధుర క్షణాలు కళ్లముందు కదలాడు తుండగానే అతడిని రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో కబళించింది. మండవల్లి మండలం ఇంగిలంపాకలంక గ్రామానికి చెందిన ఘంటసాల సాయిప్రకాశ్(23) డిగ్రీ పూర్తి చేసి విజయవాడ లోని ప్రైవేటు సంస్థలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21న పుట్టినరోజు కాగా, కుటుంబీకులు, బంధువుల సమక్షంలో వేడుకలు జరుపుకునేందుకు స్వగ్రామానికి వచ్చాడు. తిరిగి మంగళవారం ఉదయం మోటారు సైకిల్‌పై విజయవాడ బయల్దేరాడు. సుమారు 9 గంటల ప్రాంతంలో పెదపాడు మండలం కలపర్రు టోల్ గేట్ సమీపంలోకి వచ్చేసరికే తణుకు నుంచి చాట్రాయి వైపు అట్టల లోడుతో వెళుతున్న లారీ వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సాయి ప్రకాశ్ లారీచక్రాల కింద నలిగి తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిప్రకాశ్ చిన్నాన్న మోరు వెంకట శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్.సి. వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 120, 129, 140 |
| చికెన్ విత్ స్కిన్ | 230 |
| చికెన్ స్కిన్‌లెస్ | 240 |

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475





మూల్లంక కాల్వ మార్జిన్‌లో అక్రమ కట్టడాలు

## మరుగుదొడ్ల వ్యర్థాలు కాల్వలోకే..

- కాల్వ వెంబడి యథేచ్ఛగా ఆక్రమణలు
- తాగునీరు కలుషితమవుతోందని గ్రామస్థుల గగ్గోలు

కలిదిండి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుర్వాయిపాలెం- పెదలంక కాల్వ వెంబడి ఉన్న మార్జిన్‌ను యథేచ్ఛగా ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు. కాల్వ పక్కనే గేదెల పాకలు, పేడ కుప్పలు, చెత్తాచెదారం వేస్తున్నారు. ఇంటి మరుగుదొడ్డి గొట్టాలను కూడా కాల్వలోకి పెడుతున్నారు. దీంతో కాల్వలో నీరు కలుషితమవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ కాల్వ వెంబడి సుమారు 20 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. కొత్తూరు, సంతోష పురం, భాస్కరరావుపేట, మూల్లంక, పెదలంక పంచాయతీల తాగునీటి చెరువులను నింపటానికి ఈ కాల్వ నీరే సరఫరా చేస్తున్నారు. కాల్వ మార్జిన్‌లో నివాసం ఉంటున్నవారు మంచినీటి కాల్వను కలుషితం చేస్తున్నారని పలుమార్లు అర్జీలు సమర్పిం చినా అధికారులు పట్టించుకోలేదని ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భాస్కరరావుపేట, మూల్లంక గ్రామాల్లో కాల్వ పక్కనే పక్కా ఇళ్లు నిర్మించటంతో పూడికతీత పనులకు ఆటంకం కలుగుతోందని నీటి సంఘాల అధ్యక్షులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, పంచాయతీ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. తాగునీటి చెరువులకు నీటివంతు వెళ్తుండగా, కొంతమంది రైతులు చేపలు, రొయ్యల చెరువుల్లో కలుషిత నీటిని కాల్వలోకి వదులుతుండటంతో తాగునీటి చెరువులోకి కలుషిత నీరు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాల్వ వెంబడి ఉన్న ఆక్రమణలు, చెత్త కుప్పలను తొలగించాలని ప్రజలు కోరారు.

## కైకలూరు రహదారులు అధ్వానం

### అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కామినేని



కైకలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అసెంబ్లీ దృష్టికి తీసు కువెళ్లారు. అసెంబ్లీ సమావేశాల్లో కామినేని మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్కరోడ్డు నిర్మాణం కూడా చేయకపోవడంతో ధ్వంసమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం చాలావరకు అభివృద్ధి చేసినప్పటికీ మా నియోజక వర్గంలో ఇంకా రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం 1.2లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉండడంతో నిత్యం 40 టన్నుల లారీలు రాకపోకలు సాగిస్తున్నాయని, రహదారులు మెరుగుపరచాలన్నారు. ఆక్వా చెరువులు ఉన్న ప్రాంతాలపై ఆలోచన చేయా లని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎంతో సహకరిస్తుందని అయినప్పటికీ అధిక రవాణాతో రహదారులు ధ్వంసం అవుతున్నాయని సభాముఖంగా ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని రహదారుల అభివృద్ధికి సహకరించాలన్నారు.

**కామినేనికి సీఎం కితాబు..**

అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ డాక్టర్ కామినేని శ్రీనివాస్ 75 ఏళ్ళు పైబడిన వయస్సులో కూడా ఎంతో ఉత్సాహంగా ప్రజాసేవలో ముందున్నారని కొనియాడారు. అనేక మంది డాక్టర్లు ఆరోగ్యరీత్యా పేషెంట్లేనని, కామినేనిని చూసి ఆయన ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు.

## పి-4 పథకంపై శిక్షణ

ముదినేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి-4 పథకం అమలులో అధికార్లు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ముదినేపల్లి ఎంపీడీవో వై రామకృష్ణ తెలిపారు. ఈ పథకంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఎంపీడీవో మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న బంగారు కుటుంబాల గుర్తింపులో ఉద్యోగులు కార్యాచరణ అమలు చేయాలని కోరారు. దత్తత తీసుకునే వారిని కూడా గుర్తించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో అశోక్, రిసోర్స్ పర్సన్లు ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్, వడాలి పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్, వివిధ శాఖల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు.

## మహిళల సంరక్షణకే 'స్వస్థ్ నారీ' వైద్య శిబిరాలు



మందులను పంపిణీ చేస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటరమణ

కైకలూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణ కోసమే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ అన్నారు. మంగళవారం కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో, మండలంలోని కొల్లేటికోట పీహెచ్‌సీలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. కైకలూరులో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పూనుకొల్లు వెంకటరమణ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరాన్ని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ శోభ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాల్ సతీష్ మాట్లాడుతూ మహిళలు పైకి ఆరోగ్యంగా కనిపిస్తున్నప్పటికీ అనేక రుగ్మతలతో బాధపడుతుంటారని వాటిని కనిపెట్టేందుకు ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎక్కువగా క్యాన్సర్ వ్యాప్తి చెందుతోందని ఈ పరీక్షల ద్వారా వాటిని కనిపెట్టి క్యాన్సర్‌కు ఆదిలోనే వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులను, పౌష్టికాహారాన్ని ఆసుపత్రి చైర్మన్ వెంకటరమణ, మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ అందజేశారు. కైకలూరు సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రోగులకు మజ్జిగ, పులిహోర, మానవత సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లాడి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మన్నె శ్రీను, కొల్లేటికోట పీహెచ్‌సీలో ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, రాష్ట్ర తెలుగుయువత కార్య నిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, వైద్యాధికారి వి. హేమంత్ పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి:** ఆరోగ్య శిబిరాలతో మహిళలకు మరింత ఆరోగ్య రక్షణ కలుగుతుందని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. అడవి నెక్కలంలో మంగళవారం స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీపీ, షుగర్, రక్తం పర్సంటేజ్, టీబీ పరీక్షలు, నోటి, రొమ్ము, గర్భసంచి ముఖద్వారం క్యాన్సర్ల స్క్రీనింగ్ చేయడం జరిగిందని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనత వల్ల నష్టాలు, పౌష్టికాహారం ఆవశ్యకతపై గురించి అవగాహన కల్పించామని అన్నారు.

**చాట్రాయి:** ఆరుగొలనుపేట, పోతనపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్ 218 మంది మహిళలు, 66 మంది పురుషులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్ ఏర్పాటు చేసి సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అప్పిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి

### నూజివీడు ఏరియా ఆస్పత్రి వైద్యులపై బంధువుల ఆగ్రహం



శిశువును అంత్యక్రియలకు తీసుకువెళుతున్న దృశ్యం

చాట్రాయి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆ శిశువు తల్లిదండ్రులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన గొడ్డటి ఆంజనేయులు భార్య నవ్య కాన్పు కోసం ఈ నెల 19న నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేరింది. ఆ సమయంలో ఆమె జ్వరంతో పాటు ఉమ్మనీరు సమస్యతో బాధపడుతోంది. ఉమ్మనీరు సమస్య గురించి వైద్యులకు చెప్పినా జ్వరం ఉంటే అలాగే ఉంటుందని నిర్లక్ష్యం వహించారని దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించిందని భర్త ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే రోజు ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం రాత్రి మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే శిశువు అనారోగ్యంతో ఉండడంతో చికిత్స అందిస్తుండగానే ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం శిశువుకు కృష్ణారావుపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే పండంటి బిడ్డను కోల్పోయామని తండ్రి ఆంజనేయులు, బంధువులు విలపిస్తున్నారు.

**ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు**

వైద్యుల నిర్లక్ష్యంపై మంగళవారం నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణికి ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతామని చెప్పారని, 104కు కూడా ఫిర్యాదు చేశామని ఆంజనేయులు తెలిపారు. మళ్ళీ ఇటువంటి పరిస్థితి ఏ తల్లిదండ్రులకు రాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆంజనేయులు కోరుతున్నాడు.



గాయత్రిగా నూజివీడు కోట మహిషమ్మ



దేవపూడిలో బాలాత్రిపుర సుందరిగా విజయదుర్గ



లలిత త్రిపురసుందరిగా బలివే రాజ రాజేశ్వరి

## గాయత్రీ.. రక్షమాం..



కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలో చండీహోమాలు

కైకలూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీశ్యామలాంబ అమ్మవారి శ్రీచండీమహాయాగసహిత శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున క్యూలైన్లో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పుష్పాలంకరణ మండల పూర్ణవెంకట శ్రీనరసింహారావు దంపతులు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాన్ని దాతలు ఇందుకూరి వెంకటరామరాజు, తోట వెంకటరామాంజనేయులు, కోటిపల్లి రామారావు, నీలపాల గోపయ్య, కొనకళ్ళ సాంబశివరావులు అందజేశారు. ఉభయదాతల పూజల్లో 32 మంది దంపతులు, చండీహోమం పూజల్లో 13 మంది దంపతులు పాల్గొన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు తదితరులు పూజలు చేశారు. ఉభయదాతల పూజల్లో పాల్గొన్న దంపతులకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. మధ్యాహ్నం శ్రీమన్నారాయణగోష్టి అధ్యక్షురాలు చిట్టి హేమలత శిష్యబృందం కోలాట ప్రదర్శన, నాగమణి బృందం హరికథా గానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. త్రిముఖరత్నాలు నాటిక విశేషంగా అలరించింది. ఉత్సవకమిటీ సభ్యులు, ఆలయ ఈవో వీఎస్‌కె శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దసరా మహోత్సవాల్లో మూడో రోజు శ్రీశ్యామలాంబ అమ్మవారు శ్రీకాశీఅన్నపూర్ణాదేవీ అవతారంలో భక్తులకు దర్శనిమవనున్నారు. కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శ్రీదేవీఖడ్గ నామపూజ, లలితాసహస్రనామ కుంకుమపూజలను ఘనంగా నిర్వహించారు. భుజబలపట్నానికి చెందిన సయ్యపురాజు గుర్రాజు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ అధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లు నిర్వహించారు.

**కలిదిండి:** మండ లంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతు న్నాయి. భాస్కరరావుపేట గ్రామంలో పోలేరమ్మవారు గాయత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, పోకల ప్రసాద్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంతోషపురం, మూల్లంక, గుర్వాయిపాలెం, పడమటిపాలెం, కోరుకొల్లు గ్రామాల్లో దుర్గమ్మ వారిని గాయత్రిదేవిగా అలంకరించారు.

**ముసునూరు:** బలివే రామలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువైయున్న రాజరాజేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు సాముహిక కుంకుమ పూజలు చేశారు. ముసునూరు వేంకటాచల స్వామి ఆలయంలో అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించి, లలితా సహస్రనామ పారాయణం చేశారు.

**నూజివీడు టౌన్:** అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రసిద్ధిగాంచిన నూజివీడు కోటమహిషాసుర మర్దిని ఆలయంలో అమ్మవారు 2వ రోజు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ముదినేపల్లి:** దేవపూడిలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారు వెండి కిరీట ధారిణియై బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా, ఆలయ కమిటీ చైర్మన్ దాసరి భగవాన్ దాస్ ఆధ్వర్యంలో అర్చకుడు మణికంఠ పూజలు నిర్వహించారు. పెయ్యేరులోని దుర్గమ్మ లలితా దేవిగా దర్శనమిచ్చారు.

**చాట్రాయి:** చాట్రాయి, పోలవరం, జనార్దనవరం, చనుబండ, బూరుగుగూడెం, నరసింహారావుపాలెంలో పందిళ్లలో అమ్మవారు గాయత్రిగా దర్శనమిచ్చారు.





యోగా అధ్యాపకుడు పగడాలను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్

## యోగా అధ్యాపకుడికి అవార్డు

### అభినందించిన ట్రిపుల్ ఐటీ డెరెక్టర్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలో గల నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ యోగా అధ్యాపకుడు పగడాల చంద్రశేఖర్ రోటరీ క్లబ్ నుంచి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ అధ్యాపకుడిని అభినందించారు. సెప్టెంబరు 5వ తేదీ బెంగుళూరులో నిర్వహించిన కార్యక్రమంలో గత 20 ఏళ్లుగా యోగా సేవలకు గుర్తింపుగా యూనివర్సిటీ ఆఫ్ అమెరికా, రోటరీ క్లబ్ ఆఫ్ బెంగుళూరు సంయుక్తంగా ఈ అవార్డును అందించాయి. ఈ సందర్భంగా మంగళవారం చంద్రశేఖర్‌ను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అభినందించారు. ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ చిరంజీవి, పీడీ సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి వేల కోట్లు: మంత్రి



ఎల్‌వోసీని అందజేస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడుకు చెందిన జి. ఏసయ్యకు మెరుగైన వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.3.5 లక్షల ఎల్‌వోసీ చెక్కును రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. మంత్రికి ఏసయ్య కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు బలివే నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ముసునూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు నూతన చైర్మన్ శ్యామలరావు తెలిపారు.

## సామూహిక సీమంతాలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం బోర్వంచ, రామన్నగూడెం గ్రామాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. నూజివీడు మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు యనమదల శ్రీనివాస్, టీడీపీ నాయకులు ప్రసాద్‌బాబు, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, బోర్వంచ టీడీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పామర్తి వేణుగోపాలరావు, బోయపాటి అంజిబాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీమంత, అన్నప్రాసన కార్యక్రమాలు జరిగాయి.

## 4 నెలలుగా విద్యుత్ కోతలు..

### ఎత్తివేయాలని ప్రిన్సిపాల్ వినతి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలతో ఆగిరిపల్లి ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థులు గత నాలుగు నెలల నుంచి ప్రతిరోజు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ జె.ఎల్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ సమయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, తరగతి గదుల్లో ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో చిన్నారులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పాఠశాల వేళల్లో విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

## సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ఆలయం వద్ద పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాలపొంగళ్లతో తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో అర్చకులు వీరభద్ర శర్మ అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

## అక్రమ నిర్బంధం తగదు

ముసునూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేవీ ఆయుధ కర్మాగారాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాలు, గిరిజన ప్రజా సంఘాల ర్యాలీని అడ్డుకుని అక్రమంగా నిర్బంధించి పోలీసులు దాడి చేయటం అమానుషమని సీపీఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు అన్నారు. ప్రజా సమస్యలపై తహసీల్దార్ వినతి పత్రం అందజేసేందుకు ర్యాలీగా వెళుతున్న సీపీఎం నాయకులపై పోలీసుల దాడులను ఖండించారు.

## పిల్లి చిన్న వెంకటేశ్వరరావు మృతి

### వార్డు మెంబరుగా వరుసగా 4 సార్లు ఎన్నిక

చాట్రాయి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామ పంచాయతీ 9వ వార్డు మెంబరుగా 2001 నుంచి వరసగా నాలుగు సార్లు ఎన్నికైన పిల్లి చిన్న వెంకటేశ్వరరావు(55) కిడ్నీ వ్యాధితో హైదరాబాద్ ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి మాజీ సర్పంచ్ చెలికాని బాబ్జీ, గ్రామ ప్రముఖుడు చెలికాని శ్రీరామ్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.